సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
గురువారం, 20.08.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 290
పేజీలు: 08 వెల: రూ. 5


## ఫోటో జర్నలిస్టులు వార్తా పత్రికలకు 'ప్రాణం'

03

రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి

- త్వరలో జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు, హెల్త్ కార్డులు
- రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ ముకుంద రెడ్డి






## నీట్ పేపర్ లీకేజీలకు చెక్

### క్వశ్చన్ పేపర్ లీక్ చేయడం అసాధ్యమన్న కేంద్రం!

- ప్రశ్నాపత్రాలను తరలించే వాహనాలకు జీపీఎస్
- ప్రశ్నాపత్రం కూర్పునకు నిపుణుల బృందం
- సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం నివేదిక
- పక్కా ప్రణాళికలతో లీకేజీలకు చెక్

**ముద్ర, ఢిల్లీ :**
నీట్ పరీక్షల నిర్వహణలో పారదర్శకత, భద్రతపై దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, జాతీయ పరీక్షల సంస్థ (NTA) సుప్రీం కోర్టుకు కీలక వివరాలను వెల్లడించాయి. వైద్య విద్య ప్రవేశ పరీక్షల్లో పేపర్ లీకేజీలు, అవకతవకలకు అడ్డుకట్ట వేసేందుకు అత్యంత పకడ్బందీ విధానాలను అమలు చేస్తున్నామని, వీటిని ఛేదించడం అసాధ్యమని అత్యున్నత న్యాయస్థానానికి వివరించాయి. నిపుణులు ఉమ్మడిగా క్వశ్చన్ బ్యాంక్‌ను తయారు చేస్తారని, అందులో నుంచి తుది పరీక్షా పత్రంలో ఏ ప్రశ్నలు వస్తాయనేది వారికి కూడా తెలియని విధంగా గోప్యత పాటిస్తున్నామని తెలిపింది. ప్రశ్నపత్రాల రవాణా వాహనాలకు జీపీఎస్ (GPS) వ్యవస్థలను అమర్చామని, అవి ప్రతి చిన్న కదలికను రికార్డ్ చేస్తూ నిరంతరం అధికారుల పర్యవేక్షణలో ఉంటాయని స్పష్టం చేసింది. సైబర్ భద్రత కోసం ఇంటర్నెట్‌తో మిగతా 02లో

# సర్ మాయా?!

- సగం ఓట్లు సమస్యల్లోనే!
- మొత్తం ఓట్లలో 49 శాతం వరకు అనుమానాలు
- హైదరాబాద్ పరిధిలోనే భారీగా కోతలు
- 1.66 కోట్ల ఓట్లపై సందేహాల నీడలు

## 73లక్షల ఓట్లు శాశ్వతంగా తొలగింపు..

## మరో 93లక్షల ఓట్లు పెండింగ్‌లోనే

**ముద్ర డెస్క్ :**
తెలంగాణలో ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు సవరణ (SIR) ప్రక్రియ సంచలన విషయాలను వెలుగులోకి తెచ్చింది. రాష్ట్రంలో జూన్, 2026 నాటికి ఉన్న 3,38,26,244 ఓటర్లలో ఏకంగా 73 లక్షల ఓట్లు ASDD (Absent, Shifted, Deleted, Duplicate) కేటగిరీలోకి వెళ్లాయి. అంటే మొత్తం ఓట్లలో దాదాపు 22 శాతం ఓట్లు జాబితా నుంచి శాశ్వతంగా తొలగించినట్టే. మరోవైపు సుమారు 92.87 లక్షల ఓట్లు విత్‌హెల్డ్‌లో ఉంచారు. వీటి మ్యాపింగ్, పత్రాల పరిశీలన పూర్తికావాల్సి ఉంది.

### సగం ఓట్లు సమస్యల్లోనేనా?

తెలంగాణలో డిజిటైజేషన్ పూర్తయిన ఓట్లు సుమారు 2.65 కోట్లు. వీటిలోనూ దాదాపు 93 లక్షల ఓట్లకు 2002 ఓటరు జాబితాతో మ్యాపింగ్ కాకపోవడం, పత్రాల్లో తేడాలు, ఇతర అనామలీస్ వంటి సమస్యలు ఉన్నట్లు తెలుస్తోంది. తొలగించిన 73 లక్షల ఓట్లు, విత్‌హెల్డ్‌లో ఉన్న 92.87 లక్షల ఓట్లు కలిపితే 1.66 కోట్లకు పైగా ఓట్లు సమస్యల పరిధిలోకి వస్తున్నాయి. అంటే జూన్ నాటి మొత్తం ఓటర్లలో దాదాపు 49 శాతం.



### హైదరాబాద్‌లోనే భారీ ప్రభావం

SIR ప్రభావం ప్రధానంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలపై పడినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. ఈ మూడు జిల్లాల పరిధిలోనే సుమారు 43 లక్షల ఓట్లు ASDDలోకి వెళ్లగా.. మరో 39 లక్షల ఓట్లు మ్యాపింగ్, అనామలీస్ వంటి సమస్యలతో పెండింగ్‌లో ఉన్నాయి. అంటే రాష్ట్రవ్యాప్తంగా తొలగించిన, ఇంకా ఆమోదం పొందని ఓట్లలో మిగతా 02లో

## డైపర్లు వేసుకునే వ్యక్తికి మళ్లీ టికెట్ ఇస్తారా?

### సీఎం రేవంత్‌కు కళ్లు నెత్తికెక్కాయా..



- జెన్-జీ జపం చేస్తూ ఆయన పేరు ప్రకటిస్తారా..
- ఏది ఏమైనా పరకాలలో పోటీ చేసేది నేనే
- రేవూరి గెలిచిందే మా సహకారంతో..
- సీఎంపై కొండా సుస్మిత సంచలన వ్యాఖ్యలు

02

## హరీశ్‌రావు హౌస్ అరెస్ట్

### సనత్‌నగర్‌లోని టిమ్స్ ఆసుపత్రి సందర్శన

- అడ్డుకున్న పోలీసులు
- కోకాపేటలో గృహనిర్బంధం
- బీఆర్ఎస్ కార్యకర్తలు రావడంతో ఉద్రిక్తత
- భారీగా పోలీసుల మోహరింపు

02



నారాయణ ప్రిన్సిపాల్ హత్య కేసులో

## ముగ్గురి అరెస్ట్

### రూపారెడ్డికి చెందిన స్కూల్ విద్యార్థులుగా గుర్తింపు
### గంజాయికి బానిసైన ముగ్గురి ఘాతుకం..

- పోలీసుల విచారణలో కీలక విషయాలు
- హ్యాండ్ గ్లౌజ్‌లు, మాస్క్‌లు ధరించి ఇంట్లోకి చొరబాటు
- కత్తితో పొడిచి హత్య చేసిన నిందితులు
- కొన్ని రోజుల క్రితం గంజాయి తాగుతూ కంటపడిన మైనర్లు
- ఆ ఫొటోలు, వీడియోల కోసమే హత్య చేసినట్లు పోలీసుల అనుమానం

02



ఐటీ రాజధానిలో

## ట్రాఫిక్ నరకం

### కేబీఆర్ వన్-వే, గచ్చిబౌలి గుంతల రోడ్లు తిప్పలు

- రోడ్లపై గంటల తరబడి పడిగాపులు
- వర్షం వస్తే మరింత నరకమే
- శాఖల సమన్వయ లోపంతో అవస్థలు
- ఇకనైనా ట్రాఫిక్ కష్టాలు తీరేనా?

**ముద్ర డెస్క్:**
విశ్వనగరంగా ప్రపంచ పటంలో దూసుకెళ్తున్న హైదరాబాద్‌లో ట్రాఫిక్ కష్టాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి.. ఐటీ రంగానికి గుండెకాయ లాంటి గచ్చిబౌలి, మాదాపూర్ కారిడార్ల నుంచి జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ వరకు ప్రయాణించాలంటే గంటల తరబడి రోడ్లపైనే నరకం చూడాల్సి వస్తోంది. ఇటీవల హెచ్-సిటీ ఫ్లైఓవర్ , అండర్‌పాస్ పనుల నెపంతో కేబీఆర్ పార్క్ చుట్టూ ట్రాఫిక్ పోలీసులు వన్-వే విధానాన్ని అమల్లోకి తీసుకురావడం ఈ సమస్యను జటిలం చేసింది. పైలట్ డ్రైవ్‌లు పూర్తి చేశామని అధికారులు చెప్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ప్రత్యామ్నాయ మార్గాల అవగాహన లేక, అశాస్త్రీయమైన డైవర్షన్ల వల్ల కిలోమీటర్ల మేర మిగతా 02లో



ఉచిత పథకాల కోసం ప్రజాధనం

## ఎలా ఖర్చు చేస్తారు?

### కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌లపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు

04



- ప్రభుత్వ రంగ సంస్థలను లాభాల్లోకి తీసుకురావాలని సూచన
- భూసేకరణ బాధితుల సమస్యలపై పూర్తి వివరాలు ఇవ్వాలని ఆదేశం
- పథకాలపై స్టే ఎత్తివేయాలని ప్రభుత్వ న్యాయవాదుల విజ్ఞప్తి



గొడ్డలి పార్టీ నాయకుడికి

## రాజకీయాలు అవసరమా?

### ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు

- అసెంబ్లీని బహిష్కరించడం ఇదే తొలిసారి
- సభకు రాకుండా బయట కూర్చొని బురద జల్లుతున్నారు
- ప్రజా సమస్యలపై అసెంబ్లీలోనే పోరాడాలి
- గొడ్డలి పార్టీ అసత్యాలను ప్రజలు నమ్మరు

02

ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం, 20.08.2026
www.mudranews.in | @mudranews



### భోజనం తర్వాత ఎక్కువ నీరు తాగొద్దు



భోజనం తర్వాత దాహంగా ఉంటే నీరు తాగవచ్చు. అయితే గబగబా పెద్ద మొత్తంలో నీరు తాగడం వల్ల కొందరికి కడుపు ఉబ్బరం, భారంగా అనిపించవచ్చు. అవసరానికి సరిపడా మోతాదులో నెమ్మదిగా తాగడం మంచిది.

## సీఎం రేవంత్‌కు కళ్లు నెత్తికెక్కాయా

**ముద్ర, వరంగల్ న్యూస్ :**
తెలంగాణ రాజకీయాల్లో పరకాల నియోజకవర్గం కేంద్రంగా కాంగ్రెస్ పార్టీలో మరోసారి విభేదాలు తెరపైకి వచ్చాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత తీవ్ర స్థాయిలో విమర్శలు చేయడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తర్వాత రేవంత్ రెడ్డికి కళ్లు నెత్తికెక్కాయా?



అంటూ ఆమె చేసిన వ్యాఖ్య కాంగ్రెస్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఇటీవల పరకాల నియోజకవర్గంలో పర్యటించిన సీఎం రేవంత్ రెడ్డి.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డినే మళ్లీ పోటీ చేయిస్తామని ప్రకటించారు. ప్రజలు మరోసారి ఆయనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కూడా కోరారు. అయితే ఈ ప్రకటన కొండా కుటుంబంలో అసంతృప్తికి కారణమైనట్లు తెలుస్తోంది. పరకాల నుంచి పోటీ చేయాలనే ఆసక్తితో ఉన్న కొండా సుస్మిత.. ఇప్పటికే నియోజకవర్గంలో తన రాజకీయ కార్యకలాపాలను ముమ్మరం చేశారు. ఆమె తండ్రి కొండా మురళి కూడా సుస్మిత ఎన్నికల్లో పోటీ చేస్తుందని గతంలో ప్రకటించారు. దీంతో పరకాల కాంగ్రెస్‌లో రేవూరి ప్రకాశ్ రెడ్డి వర్గం, కొండా కుటుంబం మధ్య రాజకీయ పోటీ మరింత ఆసక్తికరంగా మారింది.

ఈ నేపథ్యంలో సుస్మిత.. నేరుగా సీఎం రేవంత్ రెడ్డిపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. పరకాలలో రేవూరి ప్రకాశ్ రెడ్డి పోటీని రేవంత్ రెడ్డి ఎలా ప్రకటిస్తారని ఆమె ప్రశ్నించారు. రేవూరి ప్రకాశ్ రెడ్డికి టికెట్ ఎలా ఇస్తారని నిలదీశారు. అంతేకాకుండా రేవంత్ రెడ్డి సోదరులు రాష్ట్రాన్ని దోచుకుంటున్నారంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి అయ్యాక రేవంత్ రెడ్డికి కళ్లు నెత్తికెక్కాయని వ్యాఖ్యానించారు. అంతకుముందు కూడా సుస్మిత తన సోషల్ మీడియా పోస్టులతో పరకాల రాజకీయాలపై ఆసక్తిని రేకెత్తించారు. తనను పరకాలకు కాబోయే ఎమ్మెల్యేగా పేర్కొంటూ హ్యాష్‌ట్యాగ్ పెట్టడం చర్చకు దారితీసింది. ఇప్పుడు నేరుగా సీఎంపైనే విమర్శలు చేయడంతో ఈ వ్యవహారం వేడెక్కింది. అంతేకాదు.. కాంగ్రెస్ పార్టీ తనకు టికెట్ ఇవ్వకపోతే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని సుస్మిత ప్రకటించడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి పరకాలలో కాంగ్రెస్ టికెట్ కోసం పోటీ మరింత ముదిరే అవకాశాలు కనిపిస్తున్నాయి.

రేవూరి ప్రకాశ్ రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డితో సన్నిహిత సంబంధాలు ఉండటంతోనే ఆయనకు మరోసారి టికెట్ ఖరారు చేస్తామని సీఎం బహిరంగంగా ప్రకటించారనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లో సాగుతోంది. మరోవైపు పరకాల నియోజకవర్గంపై కొండా కుటుంబానికి చాలాకాలంగా ఆసక్తి ఉందని, సుస్మితను అక్కడి నుంచి బరిలోకి దింపాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలుస్తోంది. ఒకవైపు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన.. మరోవైపు కొండా సుస్మిత తిరుగుబాటు స్వరం.. దీంతో పరకాల కాంగ్రెస్ రాజకీయాలు రసవత్తరంగా మారాయి. సుస్మిత వ్యాఖ్యలపై రేవూరి ప్రకాశ్ రెడ్డి వర్గం ఎలా స్పందిస్తుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అలాగే కాంగ్రెస్ అధిష్ఠానం ఈ వ్యవహారాన్ని ఎలా చక్కదిద్దుతుందన్నది కూడా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## ఐటీ రాజధానిలో ట్రాఫిక్ నరకం

(మొదటి పేజీ తరువాయి)
**వాహనాలు నిలిచిపోతున్నాయి.**
మరోవైపు గచ్చిబౌలి, రాయదుర్గం, కొండాపూర్, బీహెచ్‌ఈఎల్, మియాపూర్ ప్రధాన రహదారులతో పాటు కనెక్టింగ్ రోడ్లు అన్నీ భారీ గోతులతో నిండిపోయాయి. వర్షాలు పడినప్పుడల్లా మోకాలి లోతు నీరు చేరడం, ఆ గుంతల్లో వాహనాలు చిక్కుకుపోవడంతో ఐటీ ఉద్యోగుల రాకపోకలు గంటల కొద్దీ ఆలస్యమవుతున్నాయి. సీఎస్‌ఆర్, మున్సిపల్ రోడ్డు మరమ్మతుల పేరుతో ప్రచారం జరుగుతున్నా, వాస్తవానికి జిహెచ్ఎంసీ, సైబరాబాద్ అధికారుల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. పనుల ప్రక్రియ నెమ్మదిగా సాగడం, మరమ్మతులకు వాడే క్వాలిటీ మెటీరియల్ లోపించడం వల్ల వాన పడగానే వేసిన ప్యాచ్ వర్కులు కొట్టుకుపోయి రోడ్లు మళ్లీ అధ్వానంగా తయారవుతున్నాయి.

**అన్ని వైపుల నుంచి ఒకే సారి పనులు**
ఇంతటి తీవ్రమైన సమస్యను ప్రభుత్వం, సంబంధిత శాఖలు సమర్థవంతంగా హ్యాండిల్ చేయలేకపోవడానికి ప్రధానంగా సమన్వయ లేమి కారణం. ట్రాఫిక్ పోలీస్, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, మంజీరా డిజైన్ టీమ్‌లు, రహదారుల నిర్మాణ సంస్థల మధ్య ముందస్తు ప్రణాళికలు ఉండటం లేదు. ఒకరు రోడ్డు వేస్తే, మరొకరు కేబుల్స్ లేదా పైప్‌లైన్ల కోసం దాన్ని తవ్వేస్తున్నారు. పైగా మౌలిక వసతుల ప్రాజెక్టులు చేపట్టేటప్పుడు వర్క్ స్పేస్ అంచనా వేసి రాత్రి వేళల్లో వేగంగా పనులు పూర్తి చేయాల్సి ఉండగా, పగటిపూట కూడా ఆంక్షలు విధించి సివిల్ వర్క్స్ సాగదీస్తుండటం వల్ల ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ కుదేలవుతోంది.

**ప్రజలు భరించలేనంత అసౌకర్యం**
రాజకీయంగానూ ఈ అంశం ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుంటోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఓటర్లు, ఐటీ రంగానికి చెందిన ప్రొఫెషనల్స్ ప్రభుత్వం అందించే మౌలిక వసతుల పట్ల అత్యంత సున్నితంగా ఉంటారు. ఒకవైపు పన్నులు చెల్లిస్తూ, మరోవైపు రోడ్లపై గంటల కొద్దీ వేచి చూడాల్సి రావడం వల్ల పరిపాలనా వైఫల్యం అనే ముద్ర బలంగా పడే ప్రమాదం ఉంది. ప్రతిపక్షాలు కూడా ఈ ట్రాఫిక్ కష్టాలను, వర్షాకాలంలో గుంతల రోడ్ల చిత్రాలను సోషల్ మీడియాలో హైలైట్ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడిని పెంచుతున్నాయి. ట్రాఫిక్ ఒత్తిడి తగ్గించేందుకు సైబరాబాద్ పరిధిలోని ఐటీ కంపెనీలతో ప్రభుత్వం చర్చించి స్టాగర్డ్ వర్కింగ్ అవర్స్. హైబ్రిడ్ డ్రైవ్‌లను ప్రోత్సహించడంతో పాటు పలు జాగ్రత్తలు తీసుకోవాలన్న సూచనలు ప్రజల నుంచి వస్తున్నాయి.



**సమస్య నిర్వహణలేనే ఉందని నమ్ముతున్న ప్రజలు**
హైదరాబాద్‌కు ట్రాఫిక్ అనేది కేవలం ఒక రవాణా సమస్య కాదు, అది నగరం ఆర్థిక పురోగతికి, గ్లోబల్ బ్రాండ్ ఇమేజ్‌కు ముడిపడి ఉన్న అంశం. అధికారులు మసకబారిన పాత ప్రణాళికలను పక్కనపెట్టి, ప్రజా ప్రతినిధులు, పోలీసు శాఖ, సివిల్ ఇంజనీరింగ్ విభాగాలను ఒకే తాటిపైకి తెచ్చి యుద్ధప్రాతిపదికన స్పందించకపోతే.. ఈ ట్రాఫిక్ గందరగోళం ప్రభుత్వం పట్ల పట్టణ ప్రజల్లో తీవ్ర అసంతృప్తిగా రూపాంతరం చెందడం ఖాయం. భవిష్యత్ లో ట్రాఫిక్ సమస్యలు లేకుండా చేయవచ్చు కానీ ఇప్పుడు ప్రజలు భరించలేనంతగా కష్టపడితే ప్రభుత్వానికే ఇబ్బంది.

## భార్యకు అడ్డంగా దొరికిన ఫోక్ ఆర్టిస్ట్ భర్త

**ముద్ర డెస్క్:**
తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీలో వివాహేతర సంబంధం వ్యవహారం కలకలం రేపుతోంది. ఫోక్ సాంగ్స్ ఆర్టిస్ట్ మరో యువతితో ఉండగా భార్య రెడ్ హ్యాండెడ్ గా పట్టుకోవడంతో ఈ అక్రమ వ్యవహారం బట్టబయలైంది. వివరాల్లోకి వెళ్తే వేములవాడ మున్సిపల్ పరిధిలోని రెడ్డి భవన్‌లో ఇద్దరు ఫోక్ ఆర్టిస్టులు ఉన్నట్లు సమాచారం అందడంతో, నటుడి భార్య అక్కడికి చేరుకుని వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. ఈ ఘటనపై సదరు మహిళ వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఇటీవల విడుదలై బాగా పాపులర్ అయిన "బాసింగా బాసింగా బలాలే", "ప్రమీల ఓ ప్రమీల" వంటి ఫోక్ సాంగ్స్‌లో నటించిన ఈశ్వర సాయి, మాధురి రాథోడ్ ఈ ఘటనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఇద్దరు నటీనటులు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. దీనిపై పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.



## ప్రిన్సిపాల్ హత్య కేసులో ముగ్గురి అరెస్ట్

**ముద్ర, నల్లగొండ:**
నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి పట్టణంలో కలకలం రేపిన నాగార్జున పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ రూపారెడ్డి (45) దారుణ హత్య కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్పించే ప్రిన్సిపల్‌ను, ఆమె సొంత విద్యార్థులే అత్యంత క్రూరంగా హత్య చేసినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. జల్సాలు, గంజాయికి అలవాటు పడి, కేవలం డబ్బు కోసమే ఈ పక్కా స్కెచ్ వేసి హత్యకు పాల్పడినట్లు సమాచారం.

**గోడ దూకి.. 27 సార్లు కత్తితో పొడిచి..**
జేబీ కాలనీలోని నివాసంలో రూపారెడ్డి ఒంటరిగా ఉన్న సమయాన్ని నిందితులు ఆసరాగా చేసుకున్నారు. ఈ నెల 11న ఆమె భర్త హైదరాబాద్‌కు వెళ్లిన సమయంలో ఈ దారుణం జరిగింది. పాఠశాల ముగిశాక ఆమె ఇంటికి చేరుకునే ముందే, నిందితులు గోడ దూకి ఇంట్లోకి ప్రవేశించి వంటగదిలో దాక్కున్నారు. రూపారెడ్డి లోపలికి వచ్చి బెడ్‌రూమ్‌లోకి వెళ్లగానే వెనుక నుంచి ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. ఆమెపై ఏకంగా 27 సార్లు కత్తితో దాడి చేసి ప్రాణాలు తీశారు. అనంతరం ఆమె హ్యాండ్‌బ్యాగ్ నుంచి రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు నగదును దోచుకెళ్లారు.

**గంజాయి మత్తు.. హైదరాబాద్‌లో జల్సాలు**
పోలీసుల కథనం ప్రకారం.. నిందితులు గంజాయికి బానిసలై విచ్చలవిడిగా ఖర్చులకు అలవాటు పడ్డారు. సులభంగా డబ్బు సంపాదించేందుకు ప్రిన్సిపల్‌ను టార్గెట్ చేశారు. హత్య చేసిన అనంతరం ఆ దొంగిలించిన సొమ్ముతో హైదరాబాద్ వెళ్లి జల్సాలు చేశారు. తమపై అనుమానం రాకుండా ఉండేందుకు సీసీటీవీ కెమెరాలకు చిక్కకుండా జాగ్రత్తపడటమే కాకుండా, మరుసటి రోజులు ఏమీ తెలియనట్లు స్కూల్‌కు హాజరై పరిస్థితులను గమనించడం గమనార్హం.

**80 మంది విచారణ.. చిక్కిన విద్యార్థులు**
ఈ కేసును సవాలుగా తీసుకున్న పోలీసులు దాదాపు 80 మందిని సుదీర్ఘంగా విచారించారు. సాంకేతిక ఆధారాలు, అనుమానితుల కదలికల ఆధారంగా దర్యాప్తు వేగవంతం చేశారు. కొండమల్లేపల్లి మండలంలోని రెండు తండాలకు చెందిన ముగ్గురు విద్యార్థులను ఇబ్రహీంపట్నం వద్ద అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఇద్దరు నాగార్జున పబ్లిక్ స్కూల్‌లోనే పదో తరగతి చదువుతున్న విద్యార్థులుగా నిర్ధారించారు. సమాజంలో గురువులకు ఇచ్చే స్థానాన్ని దిగజారుస్తూ, విద్యార్థులే ఈ రకంగా దారుణానికి ఒడిగట్టడం స్థానికంగా తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. కేవలం డబ్బు కోసమే ఈ హత్య జరిగిందా లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నారు. పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.




## 'సర్' మాయా?!

(మొదటి పేజీ తరువాయి)
దాదాపు సగం ఈ మూ డు జిల్లాల్లోనే ఉన్నాయన్నమాట.

**పాతబస్తీలో మరింత సంచలనం**
పాతబస్తీ ప్రాంతాన్ని ప్రధానంగా కవర్ చేసే హైదరాబాద్ జిల్లాలోనే సుమారు 19 లక్షల ఓట్లు తొలగించబడ్డాయి. జిల్లాలో 47 లక్షలకు పైగా ఓటర్లు ఉండగా, దాదాపు 40 శాతం మంది తిరిగి నమోదు ప్రక్రియలో ముందుకు రాలేదు. అంతేకాదు.. ఇప్పటికే జాబితాలో ఉన్న ఓటర్లలోనూ సమస్యలు ఉన్నాయి. సుమారు 6.70 లక్షల ఓట్లకు అనామలీస్, మరో 6 లక్షల ఓట్లకు మ్యాపింగ్ సమస్యలు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి.

**వలసలే ప్రధాన కారణమా?**
హైదరాబాద్ మెట్రో నగరం కావడంతో తెలంగాణలోని ఇతర జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్, ఇతర రాష్ట్రాల నుంచి భారీగా వలసలు వచ్చాయి. ఒకే వ్యక్తికి రెండు ప్రాంతాల్లో ఓట్లు ఉండటం, సొంత జిల్లాలోనే ఓటు కొనసాగించుకోవడం, హైదరాబాద్‌లోని ఓటును వదిలేయడం వంటి కారణాలు కూడా ఓట్ల సంఖ్య తగ్గడానికి కారణమై ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. పాతబస్తీలో పత్రాల లభ్యత, సమర్పణలో ఇబ్బందులు కూడా ప్రభావం చూపినట్లు తెలుస్తోంది.

**కొత్త ఓట్లు చేరినా.. నాలుగో వంతు కోత!**
మరో ఆసక్తికర అంశం ఏమిటంటే.. SIR ప్రక్రియలో కొత్త ఓటర్లు కూడా నమోదు అయ్యారు. ఆ ఓట్లను కలుపుకున్న తర్వాత కూడా తెలంగాణలో పాత జాబితాతో పోలిస్తే దాదాపు నాలుగో వంతు ఓట్లు తగ్గినట్లు గణాంకాలు చెబుతున్నాయి. దీంతో SIR ప్రక్రియపై రాజకీయంగా, సామాజికంగా తీవ్ర చర్చ మొదలైంది. 73 లక్షల ఓట్లు మాయం.. మరో 93 లక్షలు పెండింగ్.. మొత్తం కలిపి 1.66 కోట్ల ఓట్లు సమస్యల్లో ఉండటం తెలంగాణ ఎన్నికల చరిత్రలోనే కీలక పరిణామంగా మారింది. చివరకు వీటిలో ఎన్ని ఓట్లు తిరిగి జాబితాలోకి వస్తాయి? ఎన్ని శాశ్వతంగా గల్లంతవుతాయి? అన్నదే ఇప్పుడు అసలు ప్రశ్న.

## గొడ్డలి పార్టీ నాయకుడికి రాజకీయాలు అవసరమా?

**ముద్ర, అమరావతి:**
దేవాలయం లాంటి అసెంబ్లీని ఓ పార్టీ మొత్తం బహిష్కరించడం తన రాజకీయ జీవితంలోనే చూడలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు విమర్శించారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో సీఎం చంద్రబాబు.. తాజా పరిణామాలపై కొద్దిసేపు ముచ్చటించారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చిస్తేనే వాటికి విలువ, గుర్తింపు ఉంటుందని.. బయట కూర్చొని ఎంత మాట్లాడినా ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో అసెంబ్లీ అత్యున్నత వేదిక అని తెలిపారు. 1978లో వెంకయ్యనాయుడు, జైపాల్‌రెడ్డి ఇద్దరే సభలో గట్టిగా మాట్లాడారని గుర్తు చేశారు. 1989-94లో ఎన్టీఆర్ కొన్ని రోజులు సభకు రాకపోయినా తామంతా పార్టీ తరపున అసెంబ్లీలో ప్రజల కోసం పోరాడామని వివరించారు.

2019-24 మధ్య తాను సభలో సవాల్ చేసి బయటకు వచ్చినా తమ ఎమ్మెల్యేలు చివరి రోజు వరకు ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగించారని వెల్లడించారు. ప్రజాస్వామ్యాన్ని చులకన చేసే 'గొడ్డలి పార్టీ' నాయకుడికి రాజకీయాలు అవసరమా? అని చంద్రబాబు నిలదీశారు. గ్రూప్-1 అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకే సభకు రాకుండా బయట కూర్చొని డీఎస్సీపై బురద జల్లుతున్నారని ధ్వజమెత్తారు. గొడ్డలి ప్రభుత్వం కోత పెట్టిన బీసీ రిజర్వేషన్లను తామే పునరుద్ధరించామని, ప్రభుత్వం తీసుకున్న చరిత్రాత్మక నిర్ణయాన్ని అన్ని వర్గాలు స్వాగతిస్తున్నాయని చంద్రబాబు అన్నారు. గొడ్డలి పార్టీ నాయకుడు అసత్యాలు ఎన్ని చెప్పినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదని.. అతని మాటలను ప్రజలు పట్టించుకోవడం లేదన్నారు.




## మాజీ మంత్రి హరీశ్‌రావు హౌస్ అరెస్ట్

**ముద్ర, హైదరాబాద్ :**
మాజీ మంత్రి హరీశ్ రావును పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. కోకాపేట్‌లోని హరీశ్ రావు నివాసం వద్ద భారీగా పోలీసులను మోహరించారు. సనత్‌నగర్ టిమ్స్ హాస్పిటల్ సందర్శనకు హరీశ్ రావు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు అరెస్ట్ చేశారు. కాగా, రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలను చేరువ చేయాలని కేసీఆర్ ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా నగరం నలువైపులా 'టిమ్స్' పేరుతో సూపర్‌స్పెషాలిటీ దవాఖానల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలోనే 2022 ఏప్రిల్ 26న ఒకేరోజు సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్‌లో మూడు సూపర్‌స్పెషాలిటీ దవాఖానల నిర్మాణ పనులకు కేసీఆర్ శంకుస్థాపన చేశారు. యుద్ధప్రాతిపదికన పనులను పరుగులు పెట్టించారు. అసెంబ్లీ ఎన్నికల సమయానికి అంటే ఏడాది కాలంలోనే అన్ని దవాఖానల నిర్మాణ పనులు 60 శాతానికిపైగా పూర్తయ్యాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనులను నిలిపివేసింది. అడ్డగోలు ఆరోపణలు చేస్తూ కాలం గడిపింది. అయితే బీఆర్‌ఎస్‌తోపాటు ప్రజల నుంచి వచ్చిన ఒత్తిడితో తిరిగి పనులను పట్టాలెక్కించింది. గత సంవత్సరమే మూడు సూపర్ స్పెషాలిటీ దవాఖానలు అందుబాటులోకి రావాల్సి ఉండగా, ప్రస్తుతం సనత్‌నగర్ టిమ్స్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఇటీవలే సీఎం రేవంత్ రెడ్డి మౌలిక సదుపాయాలు కల్పించకుండానే హడావుడిగా ప్రారంభోత్సం చేశారు. ఈ నేపథ్యంలో హరీశ్ రావు హాస్పిటల్ సందర్శనకు వెళ్తుండటంతో పోలీసులు అడ్డుకున్నారు.



## నీట్ పేపర్ లీకేజీలకు చెక్

(మొదటి పేజీ తరువాయి)
సంబంధం లేని 'ఎయిర్-గ్యాప్డ్ సిస్టమ్స్' మరియు సీక్రెట్ రూమ్‌లలో ప్రశ్నపత్రాల భద్రతా విధానాలను పునర్వ్యవస్థీకరిస్తున్నట్లు ఎన్టీఏ పేర్కొంది. పేపర్ లీకేజీల నివారణకు సంస్థాగత మార్పులు అవసరమని పేర్కొన్న రాధాకృష్ణన్ కమిటీ అభిప్రాయంతో సుప్రీం కోర్టు ఏకీభవించింది. నీట్ పరీక్షల సంస్కరణలపై రాధాకృష్ణన్ ప్యానెల్ మరియు నందన్ నీలేకని కమిటీ చేసిన సిఫార్సుల అమలుపై అఫిడవిట్ దాఖలు చేయాలని జాతీయ పరీక్షల సంస్థను ధర్మాసనం ఆదేశించింది. పరీక్షల వ్యవస్థ ప్రక్షాళనలో భాగంగా ఎన్టీఏ ఇప్పటికే 50 మందికి పైగా సిబ్బందిని విధుల నుంచి తొలగించింది. సైబర్ సెక్యూరిటీ, సైకోమెట్రిక్స్, క్వశ్చన్ పేపర్ డిజైనింగ్ తదితర విభాగాంశాల కోసం ప్రైవేట్ రంగానికి చెందిన నిపుణులను కూడా భాగస్వామ్యం చేస్తున్నట్లు వెల్లడించింది.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 20.08.2026
www.mudranews.in | @mudranews



**నీటిని అవసరమైనంత మాత్రమే తాగాలి**

పాలు లేదా పాలతో చేసిన పదార్థాలు కొందరికి సులభంగా జీర్ణం కావు. అలాంటి వారు వెంటనే అధికంగా నీరు తాగితే కడుపు భారంగా అనిపించే అవకాశం ఉంటుంది. కాబట్టి నీటిని అవసరమైనంత మాత్రమే తీసుకోవడం మంచిది.



# ఫోటోజర్నలిస్టులు వార్తా పత్రికలకు 'ప్రాణం'

**రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి**
**త్వరలో జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు, హెల్త్ కార్డులు**
**రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ జి.ముకుంద రెడ్డి**



**ముద్ర, హైదరాబాద్** : వార్తా పత్రికలకు ఫోటోజర్నలిస్టులు ప్రాణం వంటివారని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఒక ఫోటో వెయ్యి మాటలతో సమానమని, సమాజంలో జరిగే ప్రతి ముఖ్య ఘటనను భవిష్యత్ తరాలకు అందించే శక్తి ఫోటోజర్నలిస్టులకు ఉందని కొనియాడారు. హైదరాబాద్, బషీర్ బాగ్, దేశోద్ధారక భవన్ లో తెలంగాణ స్టేట్ ఫోటోజర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 'బెస్ట్ న్యూస్ ఫోటో కాంపిటీషన్2026'తో పాటు ఫోటో ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ జి.ముకుంద రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దాదాపు రెండున్నర దశాబ్దాలుగా తెలంగాణ స్టేట్ ఫోటోజర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. "ఫోటోగ్రాఫర్ కేవలం కెమెరాను క్లిక్ చేసే వ్యక్తి కాదు.. చరిత్రను భద్రపరిచే చరిత్రకారుడు" అని పేర్కొన్నారు. ఒక సంఘటనను ఎంత గొప్పగా రాసినా, దానికి సంబంధించిన మంచి ఫోటో ఆ ఘటనను ప్రజల కళ్లముందు సజీవంగా నిలబెడుతుందని అన్నారు. ప్రజా సమస్యలు, ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు, రాజకీయ పరిణామాలు, సామాజిక ఉద్యమాలు, పేదల కష్టాలు, విజయగాథలు తదితరాలను ఫోటోగ్రాఫర్లు తమ కెమెరాల్లో బంధిస్తున్నారని చెప్పారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సంఘటన స్థలాలకు చేరుకుని వాస్తవ పరిస్థితులను ప్రజలకు చూపించే ధైర్యం ఫోటోజర్నలిస్టుల సొంతమన్నారు. ప్రముఖుల పేర్లతో గతంలో ఏర్పాటు చేసిన ఫోటోగ్రఫీ అవార్డులను పునరుద్ధరించడం ద్వారా ఈ రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని ప్రభుత్వానికి సూచించారు. తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో ఫోటోగ్రఫీ రంగానికి సంబంధించి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.

**జర్నలిస్టుల ఇళ్ల పట్టాలు, హెల్త్ కార్డులపై త్వరలో నిర్ణయం..**

ఒక మంచి ఫోటో సమాజాన్ని ఆలోచింపజేయడంతో పాటు అధికారులను స్పందించేలా చేయగలదని రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ జి.ముకుందరెడ్డి అన్నారు. బాధితుల సమస్యలను ప్రపంచం దృష్టికి తీసుకెళ్లడంలో ఫోటోగ్రఫీ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. "కాలం గడిచిపోతుంది.. మనుషులు మారిపోతారు.. కానీ ఒక గొప్ప ఫోటో మాత్రం ఆ క్షణాన్ని శాశ్వతంగా నిలబెడు తుంది" అని పేర్కొన్నారు.

ఫోటోగ్రాఫర్ సమాజానికి నిశ్శబ్ద సాక్షి, చరిత్రకు శాశ్వత సాక్ష్యమని అన్నారు. జర్నలిస్టుల ఇళ్ల పట్టాలు, హెల్త్ కార్డులు, అవార్డుల అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని తెలిపారు. ఇళ్ల పట్టాలకు సంబంధించి రిజిస్ట్రేషన్, హౌసింగ్ సొసైటీల అంశాలను మీడియా అకాడమీ ద్వారా పరిశీలించి ఇప్పటికే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఇది ప్రభుత్వ పాలసీకి సంబంధించిన అంశమని, ప్రభుత్వం నుంచి నిర్ణయం వచ్చిన అనంతరం దశలవారీగా ప్రక్రియను ముందుకు తీసుకెళ్తామని వెల్లడించారు. జర్నలిస్టులందరికీ ఈ నెలలోనే హెల్త్ కార్డులు వచ్చే అవకాశం ఉందని ముకుందరెడ్డి తెలిపారు. హెల్త్ కార్డుల కోసం సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారని, ప్రభుత్వ ఉద్యోగులకు కార్డులు అందించిన అనంతరం జర్నలిస్టులకు కూడా ఒకేసారి అందించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.ఈ కార్యక్రమంలో టి.ఎస్.పి.జె.ఏ ప్రధాన కార్యదర్శి కె.ఎన్.హరి, ఉపాధ్యక్షులు పి.రామ్మూర్తి, టి.కిషోర్ సింగ్, కోశాధికారి కె.అనిల్ కుమార్, కార్యవర్గ సభ్యులు ఎం.ఎ.సర్వర్, జి.వసంత్ కుమార్, ఎన్.శివకుమార్, మహ్మద్ అలీమోద్దీన్, ఎ.మహేష్ పాల్గొన్నారు.

## ఫోటో, వీడియో జర్నలిస్టుల సేవలు అమూల్యం



**- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్**

**ముద్ర, కరీంనగర్** : ఫొటో, వీడియోలు ఒక క్షణాన్ని మాత్రమే బంధించవని, ఆ క్షణం వెనుక ఉన్న చరిత్రను భద్రపరుస్తాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా కరీంనగర్‌లో ఫొటో, వీడియో జర్నలిస్టులను సన్మానించిన ఆయన వారి సేవలను కొనియాడారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు నిజాన్ని చూపించడంలో ఫొటో, వీడియో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని చెప్పారు. ప్రభుత్వాల నిర్ణయాల ప్రభావాన్ని ప్రజల జీవితాల్లో చూపించేది కెమెరానేనన్నారు. సోషల్ మీడియా, ఏఐ యుగంలో ఫొటోలు, వీడియోల మార్ఫింగ్‌పై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అయితే ఫొటో, వీడియో జర్నలిస్టులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని బండి సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని జీతాలు, ఉద్యోగ భద్రత లేకపోవడం, వైద్య సదుపాయాలు అందకపోవడం, కుటుంబాలను పోషించుకోవడంలో ఇబ్బందులు పడటం బాధాకరమన్నారు. ప్రభుత్వం వారికి కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, ఇళ్ల స్థలాలు, వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అర్హులైన జర్నలిస్టులు, ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ల సమస్యలను పరిష్కరిస్తామని బండి సంజయ్ హామీ ఇచ్చారు. ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్ల నిర్మాణం, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం అందించేలా హెల్త్ కార్డులు, కనీస వేతనాల అమలుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ఉద్యోగుల పోరాటానికి బీజేపీ పూర్తి మద్దతు

**- బండి సంజయ్**

**ముద్ర, కరీంనగర్ :** ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 27 నుంచి ఉద్యోగ సంఘాల జేఏసీ చేపట్టనున్న పోరుబాటకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు చేసే పోరాటంలో బీజేపీ సైనికులు ముందుండి పోరాడతారని ఆయన అన్నారు. పోలీసులు లాఠీఛార్జ్ చేసినా, అవసరమైతే తూటాలు పేల్చినా ఉద్యోగుల తరఫున తాము నిలబడతామని భరోసా ఇచ్చారు.పీఆర్సీ అమలు, పెండింగ్‌లో ఉన్న డీఏలు, హెల్త్ కార్డులు, బకాయి బిల్లులు, 317 జీవో బాధితుల సమస్యలు, పెన్షన్ తదితర అంశాలను ప్రభుత్వం పరిష్కరించాల్సి ఉందని బండి సంజయ్ అన్నారు. జేఏసీ నాయకులు ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకుండా ఉద్యోగుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాడాలని సూచించారు. ఉద్యమాన్ని మధ్యలోనే వాయిదా వేసే నాయకుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు.కాంగ్రెస్, గత బీఆర్ఎస్ ప్రభుత్వాలు ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యాయని ఆయన విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై రేపు కరీంనగర్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఆధ్వర్యంలో భారీ ఉద్యమం నిర్వహించనున్నట్లు తెలిపారు.ఇదే సమయంలో కరీంనగర్ డెయిరీ వ్యవహారంపైనా బండి సంజయ్ స్పందించారు. రాజకీయ కక్షతో డెయిరీని దెబ్బతీయడం సరికాదని, లక్షలాది మంది రైతులకు ఉపయోగపడుతున్న సంస్థ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి న్యాయం చేయాలని కోరారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా కరీంనగర్‌లో ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లను బండి సంజయ్ ఘనంగా సన్మానించారు. సమాజానికి వారు అందిస్తున్న సేవలను కొనియాడారు.

## టీయూడబ్ల్యూజే నేత
# విరాహత్ అలీకి మాతృవియోగం

**ముద్ర, సిద్దిపేట :** తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) అధ్యక్షుడు విరాహత్ అలీ మాతృమూర్తి భాషారత్ ఉన్నిసా బేగం బుధవారం ఉదయం కన్నుమూశారు. ఆమె గత నెల రోజుల నుంచి ఆసుపత్రి లో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందారు. ఆమె అంత్యక్రియలు విరాహత్ అలీ స్వగ్రామం అయిన గజ్వేల్ నియోజకవర్గ కేంద్రంలో బుధవారం నిర్వహించారు.

అంత క్రియల్లో పలువురు సీనియర్ రాజకీయ నాయకులతో పాటు జర్నలిస్ట్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు. గజ్వేల్ పట్టణంలోని మదీనా మస్జీద్ లో నమాజ్ జనాజ పూర్తి చేసి అక్కడే ఉన్న ముస్లిం స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

కేంద్రసాహిత్య ఆకాడమీ చైర్మన్, ప్రముఖ కవి, రచయిత, డాక్టర్ నందిని సిధారెడ్డి, బీ ఆర్ ఎస్ రాష్ట్ర నాయకుడు, టీఎన్జీవో సంఘం మాజీ అధ్యక్షులు దేవి ప్రసాదరావు, ఎఫ్ డి సి మాజీ చైర్మన్, బి ఆర్ ఎస్ గజ్వేల్ నియోజకవర్గం ఇంచార్జ్ వంటేరు ప్రతాపరెడ్డి,

మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, ఐజే యు స్టీరింగ్ కమిటీ సభ్యుడు దేవులపల్లి అమర్, ఉపాధ్యక్షుడు వై. నరేందర్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు కే సత్యనారాయణ, నగునూరి శేఖర్, టీయూడబ్ల్యూజే సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు రంగా చారి, టి యు డబ్ల్యూ జే ఉపాధ్యక్షుడు ఫైజల్, కోశాధికారి ఎం వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కూతురు రాజి రెడ్డి, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు ఏ రాజేష్, హెచ్ యుజె అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్, గజ్వేల్ మున్సిపల్ చైర్మన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల టియుడబ్ల్యూజే అధ్యక్షులు యాదగిరి, శంకర్ దయాళ్, కరీంనగర్, ఆదిలాబాద్, మహబూబ్ నగర్ తో సహా తెలంగాణ లోని వివిధ ప్రాంతాలకు చెందిన జర్నలిస్టులు, తెలంగాణ వికాస సమితి అధ్యక్షులు నందిని భగవాన్ రెడ్డి, సాజిద్, జహీర్, తదితరులు అంత్యక్రియలకు హాజరయ్యారు.

# ఫిలిప్పీన్స్‌లో ఎన్నారై అడ్వైజరీ కమిటీ పర్యటన

**మనీలాలో ఇండియన్ ఎంబసీ, కమిషన్ ఆన్ ఫిలిప్పీన్స్ ఓవర్సీస్ అధికారులతో భేటీ**

**ముద్ర, హైదరాబాద్ :** తెలంగాణ నుంచి గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన సుమారు 15 లక్షల మంది కార్మికుల సంక్షేమం కోసం మెరుగైన వలస విధానాన్ని రూపొందించేందుకు ఎన్నారై అడ్వైజరీ కమిటీ ఫిలిప్పీన్స్‌లో పర్యటిస్తోంది. బుధవారం మనీలాలోని ఇండియన్ ఎంబసీ అధికారులతో కమిటీ సభ్యులు భేటీ అయి వలస కార్మికుల విధానాలపై చర్చించారు.

అనంతరం కమిషన్ ఆన్ ఫిలిప్పీన్స్ ఓవర్సీస్ ఉన్నతాధికారులతో సమావేశమై అక్కడ అమలవుతున్న వలస విధానాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలుసుకున్నారు. ఫిలిప్పీన్స్‌లో అమలవుతున్న ఉత్తమ విధానాలను పరిశీలించి, గల్ఫ్ కార్మికుల కోసం తెలంగాణలో మెరుగైన విధానాన్ని అమలు చేసేందుకు కృషి చేస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి తెలిపారు.

సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఈ పర్యటన చేపట్టినట్లు వారు పేర్కొన్నారు. కమిటీ చైర్మన్ డాక్టర్ బీఎం వినోద్ కుమార్, వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, సభ్యులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, నంగి దేవేందర్ రెడ్డి, స్వదేశ్ పరికిపండ్ల, ప్రొఫెసర్లు విజయ్ కొర్ర, శ్రీనివాస్ జునుగురు, లైజన్ ఆఫీసర్ ఆది కార్తీక్, తదితరులు ఈ బృందంలో ఉన్నారు. తదితరులు బృందంలో ఉన్నారు.



## మండలి వైస్ చైర్మన్‌గా తూమాటి మాధవరావు ఏకగ్రీవ ఎన్నిక





**ముద్ర, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ గా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనకు పోటీగా ఎవరూ నామినేషన్ దాఖలు చేయకపోవడంతో ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్లు మండలి చైర్మన్ మోషేన్ రాజు అధికారికంగా ప్రకటించారు. ఎన్నిక అనంతరం తూమాటి మాధవరావు డిప్యూటీ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భం గా మండలి చైర్మన్ మోషేన్ రాజు ఆయనను డిప్యూటీ చైర్మన్ సీటులో కూర్చోబెట్టారు. అనంతరం పలువురు ఎమ్మెల్సీలు తూమాటి మాధవరావును అభినందించారు. మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ కూడా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఇటీవలే డిప్యూటీ చైర్మన్ పదవికి వైసీపీ తరపున తూమాటి మాధవరావును అభ్యర్థిగా ఎంపిక చేశారు. పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆయన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసిన విషయం తెలిసిందే. మరోవైపు తూమాటి మాధవరావు ఏకగ్రీవంగా డిప్యూటీ చైర్మన్ గా ఎన్నిక కావడంపై చిత్రపురి కాలనీ ఆర్గనైజింగ్ సెక్రటరీ మందలపు జగదీష్ బాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన తూమాటి మాధవరావును ప్రత్యేకంగా అభినందించారు. శాసనమండలిలో డిప్యూటీ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన ఆయన సభా నిర్వహణలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. తూమాటి మాధవరావు ఎన్నికతో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ పదవి భర్తీ అయినట్లైంది. ఎన్నిక సందర్భంగా అధికార కూటమి సభ్యులు ప్రక్రియకు దూరంగా ఉన్నట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి.

## గచ్చిబౌలి హాకీ స్టేడియానికి ప్రతిష్ఠాత్మక FIH కేటగిరీ-1 సర్టిఫికేషన్

**ముద్ర, హైదరాబాద్:** గచ్చిబౌలి హాకీ స్టేడియానికి అంతర్జాతీయ హాకీ సమాఖ్య (FIH) ప్రతిష్ఠాత్మక కేటగిరీ –1 ఫీల్డ్ సర్టిఫికేషన్ లభించింది. దీంతో ప్రస్తుతం దేశంలో FIH కేటగిరీ–1 ధృవీకరణ పొందిన ఏకైక లైవ్ హాకీ టర్ఫ్‌గా గచ్చిబౌలి హాకీ స్టేడియం నిలిచింది.సర్టిఫికేషన్‌లో భాగంగా FIH నిర్వహించిన సమగ్ర ఫీల్డ్, పనితీరు పరీక్షల్లో స్టేడియం అంతర్జాతీయ ప్రమాణాలను విజయవంతంగా అందుకుంది. టర్ఫ్ నాణ్యత, బంతి కదలిక, ఆటగాళ్ల భద్రత, ఆట నాణ్యత, మన్నిక తదితర అంశాల్లో నిర్దేశిత ప్రమాణాలను పూర్తి చేసింది. అంతర్జాతీయ, టెలివిజన్ ప్రసార మ్యాచ్‌లకు కీలకమైన ఫీల్డ్ లైటింగ్‌ను కూడా FIH పరిశీలించి, TV3 స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నట్లు ధృవీకరించింది. దీంతో అంతర్జాతీయ స్థాయి టెలివిజన్ ప్రసార హాకీ పోటీలకు ఈ స్టేడియం అనుకూలంగా మారింది.ఇటీవల మార్చి 8 నుంచి 13 వరకు గచ్చిబౌలి స్టేడియంలో ఇంటర్నేషనల్ ఉమెన్స్ హాకీ క్వాలిఫయర్ మ్యాచ్‌లు విజయవంతంగా నిర్వహించడాన్ని అనుసరించి ఈ ప్రతిష్ఠాత్మక గుర్తింపు లభించింది. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ అధికారులు సమన్వయంతో కృషి చేసి, రికార్డు సమయంలో స్టేడియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేసి సిద్ధం చేశారు. FIH కేటగిరీ–1 సర్టిఫికేషన్ తెలంగాణలోని క్రీడా మౌలిక వసతులకు గణనీయమైన గుర్తింపుగా నిలవడంతో పాటు, గచ్చిబౌలి హాకీ స్టేడియాన్ని దేశంలోని ప్రముఖ అంతర్జాతీయ హాకీ వేదికల్లో ఒకటిగా మరింత బలోపేతం చేసింది. భవిష్యత్తులో మరిన్ని ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ హాకీ పోటీలకు ఆతిథ్యం ఇచ్చే సామర్థ్యాన్ని ఈ గుర్తింపు మరింత పెంచింది.

## జక్కిడి ప్రభాకర్ రెడ్డి సస్పెండ్ .. టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ ఆదేశాలు

**ముద్ర, హైదరాబాద్ :** ఎల్బీ నగర్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జక్కిడి ప్రభాకర్ రెడ్డిని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ సస్పెండ్ చేసింది. పలువురిని వ్యక్తిగతంగా, కులాల పేరుతో దూషించిన ఘటనలకు సంబంధించి ఆధారాలు లభించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. అలాగే మంత్రి కొండా సురేఖ కుమార్తె సుష్మిత పరకాలలో సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని మంత్రి కొండా సురేఖను కమిటీ ఆదేశించింది. వనపర్తి సభలో పార్టీ వ్యతిరేక వ్యాఖ్యలు, స్థానిక ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిని కూడా మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

## పార్టీ భవిష్యత్తుపై కల్వకుంట్ల కవిత వర్రీ.. జ్యోతిష్యుడిని కలిసిన వైనం!



**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణ రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక రాజకీయ వేదికను ఏర్పాటు చేసుకున్న కల్వకుంట్ల కవిత.. పార్టీ భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నారా? రాజకీయ పరిణామాలకు తోడు జ్యోతిష్య సూచనలపై కూడా ఆమె దృష్టి సారించినట్లు ప్రచారం జరుగుతోంది. ఇందులో భాగంగా ప్రముఖ జ్యోతిష్యుడు రాధాన్ పండిట్‌ను కవిత కలిసినట్లు సమాచారం.తమిళనాడు రాజకీయాల్లో ప్రముఖ నటుడు విజయ్‌కు జ్యోతిష్య సూచనలు, సలహాలు అందించిన వ్యక్తిగా రాధాన్ పండిట్‌కు గుర్తింపు ఉందని ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలోనే కవిత ఆయనను కలవడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. కవిత వెంట ఆమె కుమారుడు, ఇతర ముఖ్యులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది.తన పార్టీ భవిష్యత్తు ఎలా ఉండబోతోంది? రాజకీయంగా ఎలాంటి వ్యూహాలు అనుసరించాలి? పార్టీకి ప్రజల్లో మరింత ఆదరణ ఎలా తీసుకురావాలి? వంటి అంశాలపై కవిత జ్యోతిష్యుడి నుంచి సూచనలు కోరినట్లు సమాచారం.పార్టీని ఏర్పాటు చేసి సుమారు ఐదు నెలలు గడుస్తున్నప్పటికీ.. ప్రధాన రాజకీయ నేతలు పెద్దగా తన పార్టీ వైపు రాకపోవడం కవితకు ఆందోళన కలిగిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరోవైపు పార్టీని ఒంటిచేత్తో ముందుకు నడిపించడం, ఆర్థిక వనరులను సమకూర్చుకోవడం సవాలుగా మారినట్లు ప్రచారం సాగుతోంది.ఆశించిన స్థాయిలో విరాళాలు సమకూరకపోవడం, ప్రజల నుంచి స్పందన ఉన్నప్పటికీ రాజకీయంగా కావాల్సిన స్థాయిలో ఊపు రాకపోవడం వంటి అంశాలు కూడా కవితను కలవరపెడుతున్నట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో రాజకీయ వ్యూహాలతో పాటు జ్యోతిష్య సూచనలను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నారనే చర్చ మొదలైంది.అయితే రాధాన్ పండిట్‌తో కవిత భేటీకి సంబంధించిన పూర్తి వివరాలు, ఆమె చర్చించిన అంశాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది. ఈ భేటీ తర్వాత కవిత రాజకీయ ప్రయాణంలో ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటాయో, పార్టీ భవిష్యత్తుకు ఎలాంటి మార్గదర్శకత్వం లభిస్తుందో వేచి చూడాల్సిందే.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం 20.08.2026
www.mudranews.in | @mudranews



## పాలు, పాల పదార్థాల తర్వాత పరిమితంగా నీరు తాగాలి




పాలు లేదా పాలతో చేసిన పదార్థాలు కొందరికి సులభంగా జీర్ణం కావు. అలాంటి వారు వెంటనే అధికంగా నీరు తాగితే కడుపు భారంగా అనిపించే అవకాశం ఉంటుంది. కాబట్టి నీటిని అవసరమైనంత మాత్రమే తీసుకోవడం మంచిది.

## వర్షాకాలంలో ఈ పండును
# ఎందుకు తినాలి?

వర్షాకాలం రాగానే చల్లటి వాతావరణం ఉంటుంది. కానీ ఇదే సమయంలో వ్యాధులు విజృంభిస్తాయి. ఇలాంటి సమయంలో ఆరోగ్యంగా ఉండేందుకు ప్రత్యేకంగా ఆహారాన్ని తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇందులో భాగంగా రోగ నిరోధక శక్తిని పెంచే ఫ్రూట్స్ తీసుకోవడం వల్ల అనారోగ్యానికి గురికాకుండా కాపాడుకొని అవకాశం ఉంటుంది. అయితే వర్షాకాలంలో ఈ పండును తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరిగే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. ఇంతకీ అది ఏ పండు?



మార్కెట్లో నిత్యం విరివిగా అందుబాటులో ఉండే పండు బొప్పాయి. దీనిని చూడగానే నోరూరుతుంది. కానీ దీని కొనుగోలుపై పెద్దగా ఆసక్తి చూపరు. ముఖ్యంగా ప్రత్యేకంగా ఆరోగ్య సమస్యలు ఉన్నవారు బొప్పాయి వైపు చూడరు. కానీ వర్షాకాలంలో మాత్రం దీనిని తీసుకోవాల్సిన అవసరం ఉందని అంటున్నారు. ఎందుకంటే ఇందులో విటమిన్ సి, విటమిన్ ఏ, ఫోలేట్, ఫైబర్ వంటి పోషకాలు ఉంటాయి. ఇవి శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి.

సాధారణంగా ఈ సీజన్లో వైరల్ ఫీవర్ ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉంటాయి. అలాగే గొంతు ఇన్ఫెక్షన్ కూడా ఉంటుంది. ఈ సమస్య పరిష్కారానికి బొప్పాయిలో ఉండే పోషకాలు ఉపయోగపడతాయని చెబుతుంటారు. బొప్పాయిలో కేవలం పోషకాలు మాత్రమే కాకుండా జీర్ణ క్రియ కు అవసరమయ్యే ఫైబర్ అధికంగా ఉంటుంది. అలాగే మలబద్ధకం సమస్య ఉన్నవారు సైతం దీనిని తీసుకోవడం వల్ల సమస్య పరిష్కారం అవుతుంది. తరచుగా కడుపు నొప్పి, తీవ్ర అజీర్ణం ఉండేవారు రోజువారి ఆహారంలో దీనిని తీసుకోవచ్చు.

బరువు తగ్గాలని అనుకునే వారు కూడా ఈ పండును ఆహారంగా తీసుకోవాలి. ఇందులో నీటి శాతం అధికంగా ఉండడంతో తక్కువ తీసుకున్న కూడా ఎక్కువగా తీసుకున్నట్లు అనిపిస్తుంది. అలాగే ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీరకణాలను ఒత్తిడి లేకుండా చేస్తుంది. చర్మం, జుట్టు ఆరోగ్యానికి కూడా ఈ పండు చాలా వరకు ఉపయోగపడుతుంది. 30 ఆకుల రసం డెంగీ నివారణలో తోడ్పడుతుంది. అ యితే ఇది వైద్యుల సూచన మేరకు మాత్రమే.

అయితే దీనిని తగిన పరిమాణంలో మాత్రమే తీసుకోవాలి. అతిగా తినడం వల్ల కొత్త సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా గర్భిణీలు, ప్రత్యేక ఆరోగ్య సమస్యలు ఉన్నవారు బొప్పాయికి దూరంగా ఉండాలి. అలాగే శరీరంలో ఉష్ణోగ్రత అధికంగా ఉన్నవారు సైతం వైద్యుల సలహా మేరకు మితంగా తీసుకునే ప్రయత్నం చేయాలి.

## ఆఫీసులో మీరు చేసే
# అతి పెద్ద తప్పు

ఒక సంస్థ లేదా కంపెనీలో కొంత మంది ఉద్యోగులు తీవ్రంగా కష్టపడుతూ ఉంటారు. తమది కేవలం విధులు మాత్రమే కాకుం డా సొంత కంపెనీలా చూసుకుంటారు. అయితే ఇలా అతిగా కష్టపడిన వారు తమ పని గురించి ఇతరులకు తెలియజేయడంలో విఫలమవుతుంటారు. దీంతో వీరికి సరైన గుర్తింపు రాకుండా ఉంటుంది. ఫలితంగా వీరు ఎంతో కాలంగా ఉన్నచోటే ఉండిపోతారు.. ఉన్నత స్థాయికి వెళ్లరు. మరి ఇలాంటివారు ఏం చేయాలి?



ఒక ఉద్యోగి పనితీరు ఆ టీం లీడర్ లేదా మేనేజర్‌కు మాత్రమే తెలుస్తుంది. కానీ కొన్నిసార్లు ఇతరులకు తెలియజేయడం కూడా చాలా అవసరం. ముఖ్యంగా ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించినప్పుడు తమ గురించి తెలియ చెప్పడం ద్వారా మిగతా వారు గుర్తించే అవకాశం ఉంటుంది. అలాగే ఏదైనా సమస్య వచ్చినప్పుడు దానిని పరిష్కరించడానికి మీ వంతు కృషి చేయడం వల్ల అది సక్సెస్ అయితే అది తమ వల్లే అన్నట్లు చెప్పుకోవాలి. దీంతో భవిష్యత్తులో సమస్య పరిష్కారానికి మిమ్మల్ని సంప్రదించే అవకాశం ఉంటుంది.

ఒక ఉద్యోగి ఎక్కువగా మేనేజర్ తోనే కమ్యూనికేట్ అయి ఉంటాడు. ఇలాంటి అప్పుడు ఆ మేనేజర్ తో సంయమనం పాటించాలి. అతను చెప్పినా ప్రతి పని చేయమని కాదు.. కానీ అతని వర్క్ నువ్వు కంప్లీట్ చేయడంలో సీరియస్ ఉండాలి. అంతేకాకుండా అతనికి గుర్తింపు వచ్చే విధంగా మీ పనితీరు ఉంటే ఇద్దరికీ ఉపయోగపరంగా ఉంటుంది. అంతేకాకుండా టీం లీడర్ ఏదైనా లక్ష్యాలను ఏర్పాటు చేసుకుంటే దాన్ని పూర్తి చేయడంలో ఉద్యోగి ఎక్కువగా కష్టపడితే భవిష్యత్తులో అతనికి ప్రమోషన్ విషయంలో సహాయపడే అవకాశం ఉంటుంది.

ప్రతి ఉద్యోగి ఏదోరకంగా విజయాలు సాధించే ఉంటాడు. కానీ వాటిని డబ్బా కొట్టుకోవడం ఎందుకు? అని కొందరు అనుకుంటారు. కానీ తమ విజయాలను రికార్డు చేసుకొని సందర్భం వచ్చినప్పుడల్లా ప్రదర్శిస్తే ప్రత్యేకంగా గుర్తింపు వచ్చే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించేందుకు అవసరమైన శక్తి అందుతుంది. ఇవే కాకుండా కొన్నిసార్లు వచ్చినా ప్రశంసలు కూడా మరో పని చేయడానికి బలం చేకూరుతుంది.

కార్యాలయాల్లో నిర్వహించే సమావేశాల్లో మౌనంగా ఉండడం వల్లభారి నష్టం జరుగుతుంది. ఎందుకంటే ఇలాంటి సమయంలోనే వాక్యాతుర్యంతో అక్కడున్న వారందరినీ ఆకట్టుకోగలుగుతారు. ఫలితంగా అప్పటివరకు టీం లీడర్ కు మాత్రమే తెలిసిన ఉద్యోగి కంపెనీ మొత్తం తెలిసిపోతుంది. దీంతో కొన్నిసార్లు ప్రమోషన్ వచ్చే అవకాశాలు ఉంటాయి.

అయితే ప్రతి ఉద్యోగికి విజయాలు ఉంటాయని అనుకోలేం. అందుకు ఎదురు చూడాల్సిన అవసరం లేదు. తమ పని తాము చేసుకుంటూ పోతే ఎప్పుడైనా లక్ష్యాన్ని చేరుకునే అ వకాశం ఉంటుంది. ఇలా వచ్చిన విజయమే ఎప్పటికీ నిలిచి ఉంటుంది.

# క్యాప్‌స్టన్ సర్వీసెస్ విజయ ప్రస్థానం!

## వర్క్‌ఫోర్స్ నుంచి హోమ్ సర్వీసెస్ దాకా

**ముద్ర, బిజినెస్ బ్యూరో:**
నిజామాబాద్‌లో ప్రారంభమైన చిన్న స్థాయి సేవల ప్రయాణం.. రెండు దశాబ్దాల్లో దేశవ్యాప్తంగా విస్తరించిన వర్క్‌ఫోర్స్, ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ సంస్థగా రూపాంతరం చెందింది. ఇప్పుడు అదే అనుభవంతో నేరుగా సామాన్య వినియోగదారుల ఇంటి అవసరాలను తీర్చేందుకు కాప్ స్టన్ సర్వీసెస్ లిమిటెడ్ కొత్త అడుగు వేసింది. హైదరాబాద్ వేదికగా కాప్ స్టన్ హోమ్ సర్వీసెస్ యాప్ ను అధికారికంగా ప్రారంభించింది. సంస్థ అనుబంధ సంస్థ కాప్ స్టన్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి.




ఈ యాప్ లాంచ్ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జున ముఖ్య అతిథిగా హాజరై సేవలను ప్రారంభించారు. అంతేకాదు.. కాప్ స్టన్ హోమ్ సర్వీసెస్‌కు ఆయన బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించనున్నారు. కార్యక్రమంలో కాప్ స్టన్ సర్వీసెస్ లిమిటెడ్ చైర్మన్, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి డాక్టర్ సి.ఆర్. నాయుడు, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీకాంత్ కోడాలి, సంస్థ సీనియర్ నాయకత్వ బృందం, పరిశ్రమ ప్రతినిధులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ.. ఇంటిని నిర్మించేది కేవలం గోడలు, పైకప్పు కాదని.. నమ్మకమే ఇంటికి అసలైన పునాది అని పేర్కొన్నారు. ఇంట్లోకి వచ్చే ప్రతి సర్వీస్ కూడా అదే నమ్మకంతో ఉండాలని అన్నారు. గత రెండు దశాబ్దాలుగా ప్రముఖ సంస్థలకు మానవ వనరుల సేవలు అందిస్తూ కాప్ స్టన్ సంపాదించిన నమ్మకం, ప్రొఫెషనలిజం తనను ఆకట్టుకున్నాయని చెప్పారు. అదే ప్రమాణాలను ప్రతి ఇంటికీ అందించాలనే సంస్థ లక్ష్యంతో తాను భాగస్వామి కావడం ఆనందంగా ఉందన్నారు.



దేశంలో ఆన్‌లైన్ హోమ్ సర్వీసెస్ మార్కెట్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. పట్టణీకరణ, డిజిటల్ సేవల వినియోగం, మారుతున్న జీవనశైలి కారణంగా ఇంటి వద్దే ప్రొఫెషనల్ సేవలను పొందాలనే ఆసక్తి వినియోగదారుల్లో పెరుగుతోంది. అయితే నైపుణ్యం కలిగిన సిబ్బంది లభ్యత, సేవల నాణ్యత, సమయపాలన, భద్రత, విశ్వసనీయత వంటి అంశాలు ఈ రంగంలో ఇప్పటికీ సవాళ్లుగానే ఉన్నాయి.

ఈ నేపథ్యంలో కాప్ స్టన్ తనకు ఉన్న మానవ వనరుల నిర్వహణ అనుభవం, శిక్షణ పొందిన సిబ్బంది, బలమైన ఆపరేషనల్ వ్యవస్థలు, టెక్నాలజీ ఆధారిత సర్వీస్ మేనేజ్‌మెంట్‌ను వినియోగదారుల సేవలకు అనుసంధానిస్తోంది. వినియోగదారులకు వెరిఫైడ్ ప్రొఫెషనల్స్‌ను అందించడం, సేవలను ముందుగానే బుక్ చేసుకునే అవకాశం, పారదర్శక ధరలు, నాణ్యమైన సేవలను అందించడం ఈ యాప్ ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి.

కాప్ స్టన్ హోమ్ సర్వీసెస్ ద్వారా బ్యూటీ అండ్ వెల్‌నెస్, క్లీనింగ్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్, కార్పెంట్రీ, పెయింటింగ్, ఏసీ సర్వీసులు, గృహోపకరణాల మరమ్మతులు, పెస్ట్ కంట్రోల్ తదితర సేవలను అందించనున్నారు. మొబైల్ యాప్ ద్వారా వినియోగదారులు తమకు కావాల్సిన సేవను ఎంచుకొని సౌకర్యవంతంగా బుక్ చేసుకోవచ్చు.

కప్స్టన్ చైర్మన్ డాక్టర్ సి.ఆర్. నాయుడు మాట్లాడుతూ.. సుమారు రెండు దశాబ్దాలుగా ప్రముఖ సంస్థలకు మానవ వనరులు, సపోర్ట్ సర్వీసులు అందిస్తున్నామని తెలిపారు. వినియోగదారుల హోమ్ సర్వీసెస్ విభాగంలోకి ప్రవేశించడం తమ అనుభవానికి సహజమైన విస్తరణ అని పేర్కొన్నారు. నమ్మకమైన ప్రొఫెషనల్స్, పారదర్శక ధరలు, సమయపాలన, స్థిరమైన నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు.

మేనేజింగ్ డైరెక్టర్ శ్రీకాంత్ కోడాలి మాట్లాడుతూ.. దేశంలోని అత్యంత విశ్వసనీయ హోం సర్వీసెస్ బ్రాండ్లలో ఒకటిగా కాప్ స్టన్‌ను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తెలిపారు. హైదరాబాద్‌లో ప్రారంభమైన సేవలను త్వరలో ముంబై, ఢిల్లీ, బెంగళూరు సహా ఇతర ప్రధాన నగరాలకు విస్తరించనున్నట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా వేలాది నైపుణ్యం కలిగిన సర్వీస్ ప్రొఫెషనల్స్‌కు ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా, టెక్నాలజీ ఆధారిత నాణ్యమైన సేవలను అందించనున్నట్లు చెప్పారు.



**నిజామాబాద్ నుంచి నిత్య జీవితం వరకు..**
**ఆల్‌రౌండర్‌గా ఎదిగిన 'క్యాప్‌స్టన్ సర్వీసెస్'!**

నాగార్జున బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించడంతో కాప్ స్టన్ హోమ్ సర్వీసెస్ వినియోగదారుల్లో మరింత నమ్మకాన్ని పెంచుకోవాలని భావిస్తోంది. టెక్నాలజీ, శిక్షణ పొందిన సిబ్బంది, సంస్థాగత అనుభవాన్ని కలిపి భారతీయ కుటుంబాలకు వేగవంతమైన, నమ్మకమైన, ప్రొఫెషనల్ హోమ్ సర్వీసెస్‌ను అందించడమే తమ లక్ష్యమని సంస్థ వెల్లడించింది.




# భార్యభర్తల మధ్య దూరం
## ఎందుకు పెరుగుతుందంటే?

దురదృష్టవశాస్తూ.. ఇటీవల వివాహేతర సంబంధాల గురించి ఎక్కువగా వినాల్సి వస్తోంది. ఈ సంబంధాలు ఏర్పడడానికి కారణం ఏంటో తెలియదు గానీ.. భార్యభర్తల మధ్య సఖ్యత లేకపోవడమేనని కొందరు మానసిక నిపుణులు అంటున్నారు. అయితే ఈ విషయంపై ప్రముఖ ప్రవచన కర్త గరికిపాటి నరసింహారావు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అక్రమ సంబంధాలు ఏర్పడడానికి భార్యభర్తల మధ్య ఉండే సమస్యలే అని అనడం సంచలనంగా మారింది. అయితే మానసిక నిపుణులు తెలుపుతున్న ప్రకారం.. భార్యభర్తల మధ్య దూరం ఎందుకు పెరుగుతుంది?



వివాహ బంధంలో మాటకు ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. భార్యభర్తలు రోజంతా కలిసి ఉన్నా మనసులో ఉన్న విషయాలను పంచుకోకపోతే ఇద్దరి మధ్య భావోద్వేగ దూరం పెరిగే అవకాశం ఉంటుంది. భార్యకు ఏం కావాలి? భర్త ఏ సమస్యను ఎదుర్కొంటున్నారు? కుటుంబంలో ఏ అంశం గురించి ఆందోళన ఉంది? వంటి విషయాలను తెలుసుకోవడానికి పరస్పర సంభాషణ అవసరం. మాట్లాడుకోవడం ద్వారా చిన్న సమస్యలు పెద్దవిగా మారవు.

ప్రస్తుత కాలంలో భార్యాభర్తలు ఒకే ఇంట్లో ఉన్నప్పటికీ.. మొబైల్ ఫోన్లోని సోషల్ మీడియా,ఇతర వీడియోల కారణంగా కుటుంబ సభ్యులతో మాట్లాడే సమయం తగ్గుతోంది. భోజనం చేసేటప్పుడు, పడుకునే ముందు కూడా ఫోన్‌లోనే ఉండటం వల్ల పక్కనే ఉన్న వ్యక్తితో మాట్లాడే అవకాశం తగ్గిపోతుంది.

భార్యాభర్తల మధ్య ప్రతి విషయంపైనా ఒకే అభిప్రాయం ఉండాల్సిన అవసరం లేదు. భిన్నాభిప్రాయాలు సహజమే. అయితే ఒక సమస్య వచ్చినప్పుడు దానిపై ప్రశాంతంగా మాట్లాడకుండా మౌనం పాటించడం లేదా కోపంతో స్పందించడం వల్ల సమస్య మరింత పెరుగుతుంది. ఒక చిన్న అపార్థం పరిష్కారం కాకుండా అలాగే కొనసాగితే అది మరో విషయానికి, ఆ తర్వాత ఇంకో విషయానికి దారితీస్తుంది. చివరకు ఇద్దరి మధ్య నమ్మకం, ఆప్యాయత తగ్గే పరిస్థితి ఏర్పడవచ్చు.

అయితే భార్యాభర్తల మధ్య సంభాషణ లేకపోవడంతోనే అక్రమ సంబంధాలు ఏర్పడేందుకు కారణమని చెప్పడం సరైంది కాదు. వ్యక్తిగత నిర్ణయాలు, సంబంధాల్లో అసంతృప్తి, నమ్మకం లోపించడం, సమస్యలు, పరిస్థితులు వంటి అంశాలు ఇందులో పాత్ర పోషించవచ్చు. అందువల్ల ఇలాంటి సమస్యలను కారణంతో ముడిపెట్టవద్దు.




## ఉచిత పథకాల కోసం ప్రజాధనం
# ఎలా ఖర్చు చేస్తారు?

**కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌లపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు**
**ప్రభుత్వ రంగ సంస్థలను లాభాల్లోకి తీసుకురావాలని సూచన**
**భూసేకరణ బాధితుల సమస్యలపై పూర్తి వివరాలు ఇవ్వాలని ఆదేశం**
**పథకాలపై స్టే ఎత్తివేయాలని ప్రభుత్వ న్యాయవాదుల విజ్ఞప్తి**

**ముద్ర, హైదరాబాద్ :**
కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా తెలంగాణ హైకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. చట్టబద్ధత లేని పథకాల కోసం ప్రజాధనాన్ని ఎలా వృథా చేస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ప్రభుత్వ రంగ సంస్థలను ముందుగా లాభాల బాట పట్టించి, ఆ తర్వాత వచ్చే ఆదాయంతో ఇటువంటి ఉచిత పథకాలకు నిధులు ఖర్చు చేయవచ్చు కదా అని ధర్మాసనం అభిప్రాయపడింది. మరోవైపు భూసేకరణ బాధితులకు సరైన న్యాయం జరగక వారు నిత్యం కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని, ఈ విషయంలో ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుంటుందో రేపటి విచారణలోగా స్పష్టం చేయాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. భూ బాధితుల సమస్యలపై పూర్తి వివరాలను రేపు కోర్టు ముందు ఉంచాలని ఆదేశిస్తూనే, కేసు తదుపరి విచారణను మరుసటి రోజుకు వాయిదా వేసింది. కాగా, నిరుపేద మహిళల సంక్షేమం కోసం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై ఉన్న స్టేను తక్షణమే ఎత్తివేయాలని ప్రభుత్వం తరపు న్యాయవాదులు హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఈ పథకాల లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరిన నేపథ్యంలో, రేపటి విచారణలో హైకోర్టు తీసుకోబోయే నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 20.08.2026
www.mudranews.in | @mudranews



### వేయించిన పదార్థాలు తిన్న తర్వాత..



అధిక నీటికి దూరంగా ఉండండి. పూరీలు, పకోడీలు, సమోసాలు వంటి నూనెలో వేయించిన పదారాలు తిన్న తర్వాత కడుపు ఇప్పటికే భారంగా అనిపించవచ్చు. వాటి వెంటనే ఎక్కువ నీరు తాగితే కొందరిలో ఉబ్బరం మరింత పెరగవచ్చు. అందుకే నీటిని పరిమితంగా తీసుకోవడం మంచిది.

# పోగొట్టుకున్న రూ.కోటి.. పది రోజుల్లోనే రికవరీ

**అన్ లైన్ ట్రాన్స్ ఫర్ లో జాగ్రత్తగా వ్యవహరించండి**
**సీపీ రమేశ్**





**ముద్ర, శేరిలింగంపల్లి:** నకిలీ వాట్సాప్ ప్రొఫైల్‌తో మోసానికి గురై పోగొట్టుకున్న కోటి రూపాయలను 10 రోజుల్లోనే రికవరి చేసినట్లు సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం.రమేశ్ రెడి తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఘటనకు సంబంధించిన వివరాలను సీపీ వివరించారు. వాట్సాప్‌లో యజమాని పేరుతో నకిలీ ప్రొఫైల్ సృష్టించి రూ.కోటి సైబర్ మోసానికి పాల్పడిన కేసులో ఉత్తర ప్రదేశ్‌లోని లక్నోకు చెందిన దీపక్ కుమార్ (37)ను సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. దీపక్ కుమార్ వాటర్–ప్లాంట్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. మోసపోయిన మొత్తం రూ.1 కోటిని సురక్షితం చేసి, బాధితుడికి పూర్తిగా తిరిగి అందించారు.ఈ నెల నాల్గవ తేదీన చీరల రిటైల్ సంస్థలో పనిచేస్తున్న అకౌంటెంట్‌కు సంస్థ యజమాని పేరుతో రూపొందించిన నకిలీ వాట్సాప్ ప్రొఫైల్ నుంచి ఆర్థిక లావాదేవీకి సంబంధించిన సందేశం వచ్చిందని తెలిపారు. ఆ సందేశం సంస్థ యజమానే పంపారని నమ్మిన అకౌంటెంట్, సంస్థకు చెందిన కరూర్ వైశ్య బ్యాంక్ ఖాతా నుంచి రూ.1,00,00,000 నగదును ఇండస్ఇండ్ బ్యాంక్ ఖాతాకు బదిలీ చేశారు. ఫిర్యాదు అందిన వెంటనే సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు రంగంలోకి దిగి దర్యాప్తు ప్రారంభించారని సీపీ తెలిపారు. దర్యాప్తులో మోసపూరితంగా బదిలీ అయిన మొత్తం రాయల్ మోడా ప్రయివేటు లిమిటెడ్ పేరుతో నిర్వహిస్తున్న కార్పొరేట్ కరెంట్ ఖాతా ద్వారా మళ్లించబడినట్లు గుర్తించామని తెలిపారు. ఈ ఖాతాను మోసపూరితంగా వచ్చిన నిధులను తరలించేందుకు మ్యూల్ అకౌంట్ గా ఉపయోగిస్తున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందని చెప్పారు. బ్యాంకు లావాదేవీలు, నిధుల కదలిక మరియు ఇతర దర్యాప్తు ఆధారాలను విశ్లేషించి నిందితుడి ఆచూకీని గుర్తించామని సీపీ తెలిపారు. దీపక్ కుమార్‌ను లక్నో, ఉత్తర ప్రదేశ్‌లో ఈ నెల ఎనిమిదిన అరెస్ట్ చేశామని చెప్పారు. అనంతరం అతడిని లక్నోలోని సంబంధిత న్యాయస్థానంలో హాజరుపరచి ట్రాన్సిట్ రిమాండ్ పొందామని, ఆ తర్వాత నిందితుడిని సైబరాబాద్‌కు తీసుకువచ్చి కూకట్‌పల్లిలోని 11వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచామని తెలిపారు. న్యాయస్థానం నిందితుడిని జ్యుడీషియల్ కస్టడీకి రిమాండ్ చేసిందని వివరించారు.పోలీసుల వేగవంతమైన చర్యలు మరియు న్యాయస్థానం సకాలంలో జోక్యం చేసుకోవడం వల్ల మోసపోయిన రూ.1 కోటిని సురక్షితం చేయగలిగామని సీపీ తెలిపారు. రంగారెడ్డి పీడీజే మార్గదర్శకత్వంలో, కూకట్‌పల్లిలోని ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి–కమ్–తొమ్మిదవ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ మోసపోయిన మొత్తాన్ని సురక్షితం చేసి పునరుద్ధరించేందుకు అవసరమైన ఉత్తర్వులను ఒక్క రోజులోనే జారీ చేశారని చెప్పారు. ఘటన జరిగిన 10 రోజుల్లోనే మోసపోయిన మొత్తం కోటి రూపాయలను బాధితుడికి పునరుద్ధరించామని, ఈ మొత్తం పునరుద్ధరణ చట్టబద్ధమైన న్యాయ ప్రక్రియకు అనుగుణంగా జరిగిందని సీపీ తెలిపారు.ఎన్.సి.ఆర్.పి నిర్వహించిన తదుపరి విశ్లేషణలో నిందితుడి బ్యాంకు ఖాతాకు ఇతర రాష్ట్రాల్లో నమోదైన సైబర్ క్రైమ్ కేసులతో సంబంధాలు ఉన్నట్లు గుర్తించామని సీపీ తెలిపారు. ఈ కేసులో మిగిలిన నిందితులను గుర్తించడం, వారి పాత్రలను నిర్ధారించడం మరియు పూర్తి మనీ ట్రయిల్‌ను గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు. ఈ కేసును ఇన్‌స్పెక్టర్ ఎ. మన్మోహన్, ఎస్ఐ శ్రీనివాసులు మరియు వారి బృందం దర్యాప్తు చేశారు. సైబర్ క్రైమ్స్, సైబరాబాద్ డీసీపీ కె. పుష్ప మార్గదర్శకత్వంలో సైబర్ క్రైమ్స్, సైబరాబాద్ ఏసీపీ ఎ. రవీందర్ రెడ్డి పర్యవేక్షణలో దర్యాప్తు కొనసాగింది. అధిక మొత్తంలో డబ్బు బదిలీ చేయాలని వచ్చే ప్రతి ఆర్థిక అభ్యర్థనను డబ్బు పంపే ముందు ప్రత్యామ్నాయ కమ్యూనికేషన్ మార్గం ద్వారా తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని సూచించారు. వాట్సాప్ సందేశాలు, ప్రొఫైల్ ఫొటోలు లేదా డిస్‌ప్లే నేమ్‌ను మాత్రమే ఆధారంగా చేసుకుని ఆర్థిక అభ్యర్థన చేస్తున్న వ్యక్తి గుర్తింపును నిర్ధారించకూడదని తెలిపారు. వాట్సాప్ లేదా ఇతర మెసేజింగ్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా వచ్చే తెలియని యాప్ ఫైళ్లు లేదా అనుమానాస్పద అప్లికేషన్లను ఇన్‌స్టాల్ చేయకూడదని సూచించారు. సైబర్ ఆర్థిక మోసానికి గురైన వెంటనే 1930కు కాల్ చేయాలని లేదా ఎన్.సి.ఆర్.పి ద్వారా ఫిర్యాదు చేయాలని తెలిపారు. వెంటనే ఫిర్యాదు చేయడం ద్వారా మోసపోయిన నిధులను త్వరగా సురక్షితం చేసే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రత్యేకంగా డిజిటల్ కమ్యూనికేషన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా వచ్చే అసాధారణమైన లేదా అత్యవసరమైన డబ్బు బదిలీ అభ్యర్థనల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, డబ్బు బదిలీ చేసే ముందు సంబంధిత వ్యక్తిని స్వతంత్రంగా ధృవీకరించుకోవాలని సీపీ సూచించారు.

## ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి వెళ్తున్న నాయకులను అరెస్ట్ చేయడం సిగ్గుచేటు

**బీఆర్ఎస్వీ జిల్లా అధికార ప్రతినిధి దత్తాత్రేయ రావు**



**ముద్ర ప్రతినిధి, తాండూర్:** ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు వెళ్తున్నతెలంగాణ రాష్ట మాజీ ఆరోగ్య శాఖ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే శ్రీ తన్నీరు హరీష్ రావు తాండూర్ మాజీ ఎమ్మెల్యే శ్రీ పైలెట్ రోహిత్ రెడ్డి ని హౌస్ అరెస్ట్ చేయడం అత్యంత సిగుచేటనీ, ప్రశ్నించే నాయకులను అణగదొక్కడమే కాంగ్రెస్ పార్టీ విధానమని బీఆర్ఎస్వీ జిల్లా అధికార ప్రతినిధి దత్తాత్రేయ రావు తీవ్రంగా ఖండించారు.సనత్‌నగర్‌లోని టిమ్స్ ఆస్పత్రిలో వాస్తవ పరిస్థితులు, అక్కడ పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు తెలుసుకునేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడం దురదృష్టకరమన్నారు.కేసీఆర్ నగర్‌లో ప్రస్తుత సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ని,మణికొండలో తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డిని ఇంటి నుంచి బయటకు రాకుండా పోలీసులు అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రిలో వాస్తవ పరిస్థితులను, ప్రజల సమస్యలను వారి ఇబ్బందులను పరిశీలించడానికి వెళ్తున్న ప్రతిపక్ష నాయకులను అడ్డుకోవాల్సిన అవసరం ప్రభుత్వానికి ఎందుకు వచ్చిందో ప్రజలకు సమాధానం చెప్పాలి అని దత్తాత్రేయ రావు డిమాండ్ చేశారు.ఆస్పత్రిలో సమస్యలు లేకపోతే నాయకులను ఎందుకు అడ్డుకుంటున్నారు? ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారమై ఉంటే వారి బాధలు బయటకు రాకుండా ఎందుకు అడ్డంకులు సృష్టిస్తున్నారు? అని ప్రశ్నించారు.ప్రజా సమస్యలను ప్రశ్నించే గొంతుకలను పోలీసులతో అణచివేయాలని చూస్తే బీఆర్ఎస్ పార్టీ భయపడేది లేదు. ప్రజల పక్షాన పోరాటం చేసే నాయకులను హౌస్ అరెస్టులతో ఆపలేరు.ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నాయకులకు ప్రజల సమస్యలు తెలుసుకునే హక్కు ఉందని, పోలీసులను అడ్డుపెట్టుకొని రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం మానుకోవాలని టిఆర్ఎస్వి అధికార ప్రతినిధి దత్తాత్రేయ రావు పేర్కొన్నారు.

## ట్రెయినీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి రిమాండ్

**ముద్ర ప్రతినిధి, రాజేంద్రనగర్:** ట్రెయినీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి సంబంధించిన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది.అత్తాపూర్ పోలీసులు మూడు రోజుల కస్టడీ ముగియడంతో, దర్యాప్తులో భాగంగా ఉదయ్ కృష్ణారెడ్డికి ఉస్మానియా ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయనను ఉప్పర్‌పల్లి కోర్టులో హాజరుపరిచారు.కేసును పరిశీలించిన ఉప్పర్‌పల్లి కోర్టు.. ఉదయ్ కృష్ణారెడ్డికి ఈ నెల 24వ తేదీ వరకు రిమాండ్ పొడిగించింది.దీంతో కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు ఉదయ్ కృష్ణారెడ్డిని ఉప్పర్‌పల్లి కోర్టు నుంచి చంచల్‌గూడ జైలుకు తరలించారు.

## తాండూర్ తహసీల్దార్ ను బర్తరఫ్ చేయాలి



**ముద్ర ప్రతినిధి, తాండూర్:** ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన తహసిల్దార్ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడు తున్నాడని, వెంటనే ఆయనను ఉద్యోగం నుంచి సస్పెండ్ చేసి బర్తరఫ్ చేసి క్రిమినల్ చర్యలు చేపట్టాలని జనసత్తా వెల్ఫేర్ ఆర్గనైజేషన్ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు ఠాకూర్ సూరజ్ సింగ్ డిమాండ్ చేశారు.తాండూర్ మండలం చెంగోల్ గ్రామంలోని సర్వే నంబర్లు 200, 212, 141, 142, 143లో మొత్తం 11 ఎకరాల 8 గుంటల భూమికి సంబంధించి తప్పుడు పత్రాలు సృష్టించి, సంబంధం లేని వ్యక్తులను వారసులుగా ధ్రువీకరించి వారికి అనుకూలంగా తహసీల్దార్ వ్యవహరించారని సూరజ్ సింగ్ ఆరోపించారు.ప్రభుత్వ ఉద్యోగిగా విధి నిర్వహణలో చట్ట నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాల్సిన తహసీల్దార్, అసలు యజమానికి నష్టం కలిగించే విధంగా వ్యవహరించారని ఆరోపించారు. ఈ విషయంపై వికారాబాద్ జిల్లా కలెక్టర్, సీసీఎల్ఏ కమిషనర్‌కు ఫిర్యాదు చేసి, ఎమ్మార్వో తారా సింగ్‌ను విధుల నుంచి తప్పించాలని కోరినట్లు తెలిపారు.తారా సింగ్ తాండూర్‌లో మూడేళ్లకు పైగా విధులు నిర్వహిస్తున్నారని, ఈ కాలంలో అవినీతి, అక్రమాలకు పాల్పడి అక్రమ లాభాలు పొందుతున్నారని సూరజ్ సింగ్ ఆరోపించారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సిన బాధ్యత కలిగిన అధికారి కోట్ల రూపాయల విలువైన ఆస్తులను ఇతరుల పాలు చేసేలా వ్యవహరించారని ఆరోపిస్తూ, ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ భూములు, ఆస్తులను కాపాడాలని పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ తహసీల్దార్ పట్టించుకోలేదని, కబ్జాదారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పై అధికారులకు ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగావ్యవహరిస్తున్నారని విమర్శించారు.తాండూర్‌లోని సర్వే నంబర్ 111, 130తో పాటు కస్టోడియన్ ప్రాపర్టీలు, ఇతర ప్రభుత్వ భూములు, ఆస్తుల విషయంలో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని సూరత్ సింగ్ తెలిపారు. పైన పేర్కొన్న అంశాలపై తక్షణమే ఏసీబీకి ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని ఆయన పేర్కొనడం జరిగింది.

## ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రైవేట్ సంస్థల సహకారం అభినందనీయం

**ఎమ్మెల్యే యాదయ్య**





**ముద్ర, చేవెళ్ల:** ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయల కల్పన, నూతన భవనాల నిర్మాణం, విద్యార్థుల ఉన్నత చదువులకు ప్రైవేట్ సంస్థలు చేయూత ను అందించడం అభినందనీయమని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. షాబాద్ మండలం పెదవేడు గ్రామంలో అమెజాన్ సంస్థ స్వంత నిధులతో నిర్మించిన పాఠశాల భవనం, అంగన్వాడీ భవనాలను బుధవారం అయన సంస్థ ప్రతినిధులు, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మహనీయుల జీవితాలను ఆదర్శం గా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. షాబాద్ మండలం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని, పలు పరిశ్రమలు రావడంతో ఉపాధి అవకాశాలు మెరుగు పడ్డాయని అన్నారు. యువత సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.పరిశ్రమల యాజమాన్యం ప్రత్యేక దృష్టి సరించి ఈ ప్రాంత అభివృద్ధి లో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పెంటారెడ్డి, చెంద్రశేఖర్, మల్లేష్, పంది, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన



**ముద్ర, చేవెళ్ళ:** చేవెళ్ల మండల పరిధిలోని దేవరాంపల్లి గ్రామంలో బుధవారం నూతనంగా నిర్మించిన దుర్గామాత, పోచమ్మ తల్లి దేవాలయాల్లో విగ్రహ ప్రతిష్టపన వైభవం గా నిర్వహించారు. గ్రామం లో ఆధ్యాత్మిక శోభ నెలకొన్నది. ఆనంతరం బోనాల జాతర నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున బోనాలు సమర్పించిన మొక్కులు తీర్చుకున్నారు. పూజల్లో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గ్రామ దేవతలు పోచమ్మ, దుర్గమ్మ తల్లీ గ్రామస్తులను చల్లంగా చూడాలని కోరుకున్నారు. గ్రామ సర్పంచ్ మనిలా నరహరి రెడ్డి, గ్రామపెద్దలు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూజలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు కృష్ణారెడ్డి, ప్రభాకర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు



**ఎమ్మెల్యే యాదయ్య**

**ముద్ర, చేవెళ్ళ:** అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందచేస్తామని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. చేవెళ్ల పురపాలిక దా మారగిద్ద లో ఇందిరమ్మ ఇంటిని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదల ఆభ్యున్నతి కి పాటుపడుతుందని అన్నారు. పురపాలిక లో మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు వెంకట్ రెడ్డి, ఆగిరెడ్డి, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## టికెట్ ధరల పెంపుపై ప్రభుత్వం కీలక నిర్ణయం

**ముద్ర, హైదరాబాద్:** సినిమా టికెట్ ధరల పెంపు ద్వారా వచ్చే అదనపు ఆదాయంలో 20 శాతాన్ని సినీ కార్మికుల సంక్షేమానికి కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం ఆదేశించింది. ఈ మొత్తాన్ని TGFDC లేదా తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఖాతాల్లో జమ చేయాలని స్పష్టం చేసింది.ఎగ్జిబిటర్ల నుంచి ఈ మొత్తాన్ని వసూలు చేసి సంబంధిత ఖాతాల్లో జమ చేసే బాధ్యత నిర్మాతలదేనని ప్రభుత్వం పేర్కొంది. ఈ నిబంధనను 'పెద్ది', 'ది రాజాసాబ్', 'మన శంకర వరప్రసాద్ గారు', 'అఖండ–2' వంటి భారీ చిత్రాలకు వర్తింపజేయాలని ఆదేశించింది.

## వైఎస్ జగన్‌ను కలిసిన శాసనమండలి డిప్యూటీ చైర్మన్

**ముద్ర, తాడేపల్లి:** ఆంధ్రప్రదేశ్ శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.డిప్యూటీ చైర్మన్‌గా తనకు అవకాశం కల్పించినందుకు జగన్‌కు మాధవరావు కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పదవికి వన్నె తెచ్చేలా బాధ్యతలు నిర్వర్తిస్తానన్నారు. మాధవరావును జగన్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం వైఎస్సార్‌సీపీకి చెందిన ఎమ్మెల్సీలు కూడా జగన్‌ను కలిసి మాధవరావుకు అభినందనలు తెలిపారు.

## 27 నుంచి ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ లాటరీ

**అర్హుల జాబితా 20న ఆన్‌లైన్‌లో..**
**23 వరకు అభ్యంతరాల స్వీకరణ**
**యూట్యూబ్ ద్వారా లాటరీ ప్రత్యక్ష ప్రసారం**

**ముద్ర, హైదరాబాద్, ఆగస్టు 19:** ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ప్రభుత్వం నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌లో ఇళ్ల కేటాయింపునకు ఈ నెల 27 నుంచి లాటరీ నిర్వహించనున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి.గౌతమ్ తెలిపారు. 27 నుంచి 30 వరకు రోజుకు నాలుగు నియోజకవర్గాల చొప్పున లాటరీ నిర్వహిస్తామన్నారు.పైలట్ ప్రాజెక్టులో భాగంగా 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 7,340 ఇళ్ల కోసం స్వీకరించిన దరఖాస్తుల పరిశీలన జరుగుతోందన్నారు. అర్హుల జాబితాను గురువారం సాయంత్రం నుంచి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. జాబితాపై అభ్యంతరాలను ఈ నెల 23 వరకు స్వీకరిస్తామని, తుది అర్హుల జాబితాను 25న ప్రకటిస్తామని చెప్పారు.అర్హుల ఎంపికను ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు తదితర రిజర్వేషన్ల ప్రకారం లాటరీ ద్వారా చేపడతామన్నారు. ప్రతి కేటగిరీలో 20 శాతం వెయిటింగ్ లిస్టును కూడా రూపొందిస్తామని తెలిపారు. లాటరీ ప్రక్రియను అధికారులు, మీడియా సమక్షంలో పారదర్శకంగా నిర్వహించి యూట్యూబ్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తామని వెల్లడించారు.అభ్యర్థుల సందేహాల నివృత్తికి 040–24603572 కాల్ సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు.

## ఇంద్రకీలాద్రిపై ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు రవిశంకర్ గురూజీ ప్రత్యేక పూజలు



**ముద్ర, విజయవాడ:** ప్రముఖ ఆధ్యాత్మిక సంస్థ ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక గురువు శ్రీ శ్రీ రవిశంకర్ గురూజీ బుధవారం నాడు ఇంద్రకీలాద్రిపై వేంచేసియున్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానాన్ని సందర్శించారు. ఆయనతో పాటు మాజీ పార్లమెంట్ సభ్యులు గోకరాజు గంగరాజు కూడా అమ్మవారిని దర్శించుకున్నారు.ఆలయానికి విచ్చేసిన రవిశంకర్ గురూజీ గారికి దుర్గగుడి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), దేవస్థాన కార్యనిర్వహణాధికారి వీ.కే. సీనా నాయక్ మరియు పాలక మండలి (ట్రస్ట్ బోర్డ్) సభ్యులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. గురూజీ మరియు ప్రముఖుల పర్యటన నిమిత్తం ఆలయ అధికారులు, పాలకమండలి సభ్యులు అన్ని ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు.అనంతరం వారు అంతరాలయంలో శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం ఆలయ వేద పండితులు వారికి వేదాశీర్వచనం పలకగా, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో సీనా నాయక్ గారు అమ్మవారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు మరియు అమ్మవారి చిత్రపటమును గురూజీకి బహూకరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు, అధికారులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం 20.08.2026
www.mudranews.in | @mudranews



### దాహంగా ఉంటే నీరు తాగడం తప్పు కాదు

భోజనం చేసిన వెంటనే నీరు తాగితే జీర్ణక్రియ పూర్తిగా ఆగిపోతుందనే మాటలకు శాస్త్రీయ ఆధారం లేదు. శరీరానికి నీరు అవసరం కాబట్టి దాహంగా ఉన్నప్పుడు నీరు తాగవచ్చు. అయితే పదేపదే ఉబ్బరం లేదా కడుపు భారంగా అనిపిస్తే నీటి పరిమాణాన్ని తగ్గించి, కొంత విరామంతో తీసుకోవడం మంచిది.



# రహదారుల అభివృద్ధితో పరిశ్రమలు, ఉపాధి అవకాశాల విస్తరణ

**- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**





**ముద్ర, సుల్తానాబాద్ :** రహదారుల అభివృద్ధితో పరిశ్రమలు, వ్యాపారాలు విస్తరించడంతో పాటు స్థానిక యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. రహదారుల అభివృద్ధి సంక్షేమ పథకాలతో సమానంగా రాష్ట్ర ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు.సుల్తానాబాద్ మండలం గరేపల్లిలో రూ.219.67 కోట్ల విలువైన హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏఎం), నాన్‌ప్లాన్ రహదారి అభివృద్ధి పనులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు తదితరులతో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. పెద్దపల్లి ప్రజలు మంచి నాయకుడిని ఎమ్మెల్యేగా ఎన్నుకున్నారని, ప్రభుత్వ విప్ విజయరమణారావు నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తున్నారని ప్రశంసించారు. ప్రభుత్వం ఏర్పడిన నెలలోపే పెద్దపల్లి బైపాస్ రహదారికి నిధులు మంజూరు చేశామని, ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఏడాదిలోపు బైపాస్ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.రాష్ట్రవ్యాప్తంగా ఆర్అండ్‌బీ శాఖ పరిధిలో రూ.13 వేల కోట్లతో, పంచాయతీరాజ్ శాఖ పరిధిలో రూ.17 వేల కోట్లతో రహదారి పనులు జరుగుతున్నాయని మంత్రి వెల్లడించారు. హెచ్ఏఎం విధానంలో ప్రభుత్వం 40 శాతం, కాంట్రాక్టర్ 60 శాతం నిధులు భరించే విధంగా పనులు చేపడుతున్నామని తెలిపారు. గరేపల్లిలో శంకుస్థాపన చేసిన పనులను రెండేళ్లలో పూర్తి చేస్తామని, వారం రోజుల్లోనే క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు.రహదారుల అభివృద్ధి వల్ల కొత్త పరిశ్రమలు, వ్యాపార సంస్థలు ఏర్పడటానికి అనుకూల వాతావరణం కలుగుతుందని, దీంతో స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మంత్రి అన్నారు. రోడ్డు భద్రతా నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని, ప్రమాదాల నివారణలో వాహనదారులు, ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.గత ప్రభుత్వం సుమారు రూ.40 వేల కోట్ల పెండింగ్ బిల్లులను వదిలి వెళ్లిందని మంత్రి తెలిపారు. హైదరాబాద్ నుంచి రామగుండం వరకు కొత్త గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణంపై కేంద్ర మంత్రితో చర్చలు జరిపామని, ప్రతిపాదిత రహదారిలో సుల్తానాబాద్ బైపాస్‌ను కూడా చేర్చి మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు నీటిని పొదుపుగా వినియోగిస్తూ ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ముఖ్యంగా ఆయిల్‌పామ్ సాగును విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ, డ్రిప్, స్ప్రింక్లర్, రుణమాఫీ వంటి కార్యక్రమాలకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోందని తెలిపారు.ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. గత పది సంవత్సరాల్లో పెద్దపల్లి జిల్లాలో కేవలం రూ.900 కోట్ల విలువైన రహదారి పనులు మాత్రమే మంజూరయ్యాయని, ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1,700 కోట్ల విలువైన రహదారి పనులు మంజూరయ్యాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో ఈ అభివృద్ధి సాధ్యమైందన్నారు.పెద్దపల్లి జిల్లాలో రైస్‌మిల్లులు అధికంగా ఉన్నందున గోదాముల సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉందని శ్రీధర్‌బాబు అన్నారు. రైతుల నుంచి కనీస మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, మొక్కజొన్నను కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు నీటిని సమర్థవంతంగా వినియోగిస్తూ ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని సూచించారు. ప్రభుత్వ విప్ విజయరమణారావు మాట్లాడుతూ.. గత రెండున్నరేళ్లలో పెద్దపల్లి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. జూలపల్లి మండల కేంద్రంలో రూ.15 కోట్లతో నాలుగు లేన్ల రహదారి, సెంట్రల్ లైటింగ్, కాల్వ శ్రీరాంపూర్‌లో రూ.7.35 కోట్లతో నాలుగు లేన్ల రహదారి, సెంట్రల్ లైటింగ్ పనులు చేపడుతున్నామని చెప్పారు. గంగారం, ఉషన్నపల్లి, పాండిల్ల గ్రామాల్లో రూ.17 కోట్లతో సింగిల్ లేన్ రహదారులను డబుల్ లేన్‌గా విస్తరించే పనులకు కూడా శంకుస్థాపన చేసినట్లు తెలిపారు.పెద్దపల్లి బైపాస్ రహదారికి గతంలోనే మంజూరు వచ్చినప్పటికీ పనులు ముందుకు సాగలేదని, ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రూ.82 కోట్లు మంజూరు చేయించిందన్నారు. భూసేకరణకు అవసరమైన మరో రూ.27 కోట్లను త్వరలో విడుదల చేయిస్తామని, ఏడాదిలోపు బైపాస్‌ను పూర్తి చేసి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సుల్తానాబాద్ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నందున బైపాస్ నిర్మాణం అత్యవసరమని, దీనిపై మంత్రులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.రైతుల ఆదాయం పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తున్నామని శ్రీధర్‌బాబు తెలిపారు. పెద్దపల్లి నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మొదటి విడతలో 3,500 ఇళ్లు మంజూరు కాగా, ప్రస్తుతం మరో 2 వేల ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. మహిళలకు వడ్డీలేని రుణాల పంపిణీ ద్వారా వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొన్నారు.కాగా, పెద్దపల్లి నియోజకవర్గంలో ఒకే పంట కాలంలో 2.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం, 40 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేసినట్లు విజయరమణారావు తెలిపారు. రైతులకు సకాలంలో చెల్లింపులు చేశామని చెప్పారు. మరో 60 వేల మెట్రిక్ టన్నుల గోదాముల సామర్థ్యం, 5 వేల మెట్రిక్ టన్నుల కోల్డ్ స్టోరేజ్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్, సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ రాధాకృష్ణ, పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, గోదావరిఖని డిప్యూటీ మేయర్ పారుపల్లి ఎల్లయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్లు మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.





## కరీంనగర్‌లో ఘనంగా వైశ్య భవన్ పునర్నిర్మాణ భూమిపూజ

**హాజరైన కేంద్రమంత్రి బండి సంజయ్, మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్**



**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్ జిల్లా కేంద్రంలోని గాంధీ రోడ్ లో ఉన్న ప్రతిష్టాత్మక వైశ్య భవన్ ను అత్యాధునిక హంగులతో నూతన కన్వెన్షన్ హాల్ గా పునర్నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు చేపట్టిన భూమిపూజ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకకు కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్, కరీంనగర్ శాసనసభ్యులు, మాజీ మంత్రి గంగుల కమలాకర్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు.గాంధీ రోడ్ లోని వైశ్య భవన్ ప్రాంగణానికి చేరుకున్న కేంద్రమంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ లకు వైశ్యసేవ కేంద్రం నిర్వాహకులు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. వారికి పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి, నూతన కన్వెన్షన్ హాల్ నిర్మాణానికి అంకురార్పణ చేస్తూ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా నూతన కన్వెన్షన్ హాల్ కు సంబంధించిన వివరాలతో కూడిన కరపత్రాలను అతిథులు ఆవిష్కరించారు.

### పూర్తి సహకారం అందిస్తాం...: ఎమ్మెల్యే గంగుల కమలాకర్

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. ఆర్యవైశ్యుల సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకే కాకుండా ప్రజలందరికి వేదికగా నిలిచే ఈ భవనాన్ని మరింత ఆధునిక వసతులతో కూడిన కన్వెన్షన్ హాల్ గా తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. ఈ భవన నిర్మాణ పనులకు తన వంతు పూర్తి సహకారం ఉంటుందని ఈ సందర్భంగా ఆయన భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో వైశ్యసేవ కేంద్రం అధ్యక్షులు చిదుర సురేష్, కార్యదర్శి విద్యాసాగర్, కోశాధికారి రమేష్ తో పాటు పలువురు ప్రముఖ ఆర్యవైశ్యులు, సంఘం నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## సోమారం గ్రామంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటన

**– పల్లె పల్లెకు పొన్నం అన్న – పల్లె పల్లెలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా గ్రామస్థుల నుంచి వినతులు స్వీకరణ..**
**- తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు**




**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం సోమారం గ్రామంలో "పల్లె పల్లెకు పొన్నం అన్న – పల్లె పల్లెలో ప్రజా పాలన" కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని గ్రామస్థుల సమస్యలను తెలుసుకున్నారు. గ్రామానికి సంబంధించిన సమస్యలతో పాటు వ్యక్తిగత సమస్యలపై ప్రజలు సమర్పించిన లిఖితపూర్వక వినతి పత్రాలను స్వీకరించి, ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో అక్కడికక్కడే మాట్లాడారు.ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించడమే "పల్లె పల్లెకు పొన్నం అన్న – పల్లె పల్లెలో ప్రజా పాలన" కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నాయా లేదా అనే విషయాన్ని తెలుసుకునేందుకే గ్రామాల్లో పర్యటిస్తున్నట్లు చెప్పారు.సోమారం గ్రామానికి మొదటి దశలో 16 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, అవి పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. త్వరలోనే రెండో దశలో మరిన్ని ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు.కొత్త పెన్షన్ల కోసం ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతుందని మంత్రి తెలిపారు. వి

#### ఆయిల్‌పామ్ సాగు వైపు రైతులు దృష్టి సారించాలి

గ్రామంలోని రైతులు ప్రత్యామ్నాయ, లాభదాయకమైన పంటల వైపు దృష్టి సారించాలని మంత్రి సూచించారు. ముఖ్యంగా ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. 200 ఎకరాలకు పైగా భూమి ఉన్న గ్రామాలకు అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ.5 లక్షలు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

#### ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మించాలి

నీటి సంరక్షణకు ప్రభుత్వం చేపడుతున్న "జలసిరి" కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మించుకుని వర్షపు నీటిని భూగర్భంలోకి పంపించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజలు పీఎం సూర్య ఘర్ పథకం ద్వారా ఇళ్లపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకోవాలని మంత్రి సూచించారు. సౌర విద్యుత్‌ను వినియోగించడం ద్వారా విద్యుత్ ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని తెలిపారు.

#### 173 గ్రామాల్లో పర్యటన

ప్రజా సమస్యలను తెలుసుకోవడం, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరుతున్నాయా లేదా తెలుసుకోవడం కోసం నియోజకవర్గంలో 173 గ్రామాల్లో పర్యటించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గ్రామాల్లో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తానని చెప్పారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కందుల అనిత అంజితో పాటు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులకు బండి సంజయ్ శంకుస్థాపన

**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 39వ డివిజన్ పోచమ్మవాడ ప్రాంతంలో రూ: 90 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ భూమిపూజ చేసి పనులు ప్రారంభం చేశారు. అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ UIDF నిధులతో ఈ అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతోంది. ఈ కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి & డిప్యూటీ మేయర్ (మాజీ మేయర్) యాదగిరి సునీల్ రావు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ స్థానిక కార్పొరేటర్ మాసం గణేష్, కార్పొరేటర్లు బండ రమణారెడ్డి, బోయినపల్లి ప్రవీణ్ రావు,ఎన్నం ప్రకాష్, దేవసాని సత్యనారాయణ, గాజ శివరాం, తాటి ప్రభావతి, అధికారులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## కోరుట్ల కెమెరా క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రఫీ డే వేడుకలు

**ముద్ర, కోరుట్ల;** ప్రపంచ 187వ ఫోటోగ్రఫీ డే సందర్భంగా ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లతో కలిసి కోరుట్ల కెమెరా క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఫోటోగ్రాఫర్ల సంఘం సూచనల మేరకు ఆదేశాలను అనుసరించి జెండా ఆవిష్కరణ కార్యక్రమం కోరుట్లలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా లూయిస్ డాగురే ని స్మరించుకుంటూ కేక్ కట్ చేసి, అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి లో పండ్లు బ్రెడ్స్ పంపిణీ, అలాగే ప్రభుత్వ పాఠశాల లో పిల్లలకు బుక్స్, పెన్, పెన్సిల్ తో పాటు స్లేట్స్ ని అందించారు. కోరుట్ల కెమెరా అధ్యక్షులు తడుక సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

**- మంత్రి పొన్నం ప్రభాకర్**
*** చిగురుమామిడి సర్పంచ్ ఆకవరం భవాని కాంగ్రెస్ పార్టీలో చేరిక...**



**ముద్ర చిగురుమామిడి:** గ్రామాల అభివృద్ధి ద్వారానే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం చిగురుమామిడి మండల కేంద్రంలో చిగురుమామిడి సర్పంచ్ ఆకవరం భవాని కాంగ్రెస్ పార్టీలో చేరగా మంత్రి పొన్నం ప్రభాకర్ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ అభివృద్ధిలో భాగంగా హుస్నాబాద్ నియోజకవర్గంలో పాటు చిగురుమామిడి మండలాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామన్నారు.ఇటీవల కాలంలో చిగురుమామిడి మండలానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు.మండలంలోని వివిధ గ్రామాలను కలుపుతూ నాలుగు వరుసల రహదారి మంజూరు.వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులలో భాగంగా మండలాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు.చిగురుమామిడి సర్పంచ్ ఆకవరం భవాని కాంగ్రెస్ పార్టీలో చేరడం పార్టీకి మరింత బలాన్ని చేకూరుస్తుందన్నారు.అనంతరం సర్పంచ్ భవాని మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో ప్రజలు తోడ్పడాలన్నారు,మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శ గ్రామంగా చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందె సురేష్,డిసిసి ఉపాధ్యక్షుడు గీకుర్ రవీందర్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మార్క రాజ్ కుమార్,కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు పోలు స్వప్న,యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోయిని వేణు గోపాల్,జిల్లా నాయకులు చిట్టి మల్ల రవీందర్ కాంగ్రెస్ నాయకులు పోటు మల్లారెడ్డి,గూళ్ళ రాజు,ఆకవరం శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ కట్టడాల పై త్వరితగిన చర్యలు తీసుకోవాలి

**కస్తూరి లక్ష్మీనారాయణ - బీజేపీ పట్టణ అధ్యక్షులు....**



**ముద్ర, కోరుట్ల;** భారతీయ జనతా పార్టీ కోరుట్ల పట్టణ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని చారిత్రక కట్టడాలైన గడి బురుజుల స్థలాల అన్యాక్రాంతం విషయమై మున్సిపల్ కమీషనర్ ని కలిసి చర్చించి ఎల్ ఆర్ నెంబర్ S3/974/2013, 14 వ తేదీ 2015 ప్రకారం చారిత్రక గడి బురుజుల స్థలాల చుట్టూ 15 ఫీట్ల వరకు ఎటువంటి కట్టడాలు ఉండకూడదు. దానికి విరుద్ధంగా చాలా కట్టడాలు నిర్మించబడ్డాయి. గడి బురుజుల ను ఆనుకొని మరియు కోనేరు పైన కట్టిన అక్రమ ఇళ్ల నిర్మాణాల గురించి ఫోటోలతో సహా పిర్యాదు చేయడం జరిగింది. మైసమ్మ గుడి కి సంబంధించిన తాత్కాలిక షెడ్ ను 24 గంటల లోపు ధ్వంసం చేశారు. మరి అక్రమకట్టడాల మీద ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని కమిషనర్ ప్రశ్నించడం జరిగింది. అక్రమ కట్టడాల పై త్వరితగిన చర్యలు తీసుకోని ఎడల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు కస్తూరి లక్ష్మీనారాయణ, ఎండోమెట్ ధార్మిక సెల్ జిల్లా కన్వీనర్ మాడవేణి నరేష్, కౌన్సిలర్లు ఇందూరి తిరుమలవాసు, గుగ్లావత్ శ్రీకాంత్, పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాకల గణేష్,, మాజీ కౌన్సిలర్ , పెండెం గణేష్, ఉపాధ్యక్షులు నెమూరి విజయ్, మోర్చా అధ్యక్షులు బెక్కం అశోక్ నాయకులు కళా సాయి చంద్, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

ముద్ర
సమగ్ర సమాచార పత్రిక
గురువారం 20.08.2026
www.mudranews.in | @mudranews



**నీటి శాతం ఎక్కువగా ఉన్న ఆహారం తర్వాత జాగ్రత్త**

పుచ్చకాయ, ఖర్బూజా, దోసకాయ వంటి నీటి శాతం అధికంగా ఉన్న ఆహారాలు తిన్న వెంటనే ఎక్కువ నీరు తాగితే కడుపు నిండినట్లు అనిపించవచ్చు. దాహం లేకపోతే వెంటనే ఎక్కువ నీరు తీసుకోకుండా ఉండటం సౌకర్యంగా ఉంటుంది.



# కబ్జా భూములు స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలి

**రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం ఆగస్టు 19 :** పల్లెగూడెంలోని ప్రభుత్వ, అసైన్డ్ భూములను అక్రమంగా ఆక్రమించిన వారి నుంచి వెంటనే స్వాధీనం చేసుకుని, గ్రామంలోని అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి, ఆక్రమణలను గుర్తించి వెంటనే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు. పల్లెగూడెంలో రూ. 20లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి అర్హుడికీ సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుకోసమే భూములను సమీకరించి ఇళ్ల స్థలాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.పల్లెగూడెం సమగ్ర వికాసానికి రూ.61.76 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మంత్రి ప్రకటించారు. అర్హులైన వయోవృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు పింఛన్ల కోసం ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. దివ్యాంగులకు ప్రభుత్వం అండ : మంత్రి పొంగులేటిదివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు. కూసుమంచి క్యాంపు కార్యాలయంలో అర్హులైన 12 మంది లబ్దిదారులకు 100% సబ్సిడీపై త్రీ వీలర్ సైకిళ్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముంద డుగు వేసి సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల, ఆర్డీవో ఎన్.శ్రీనివాస్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## భాజపా కుట్రపూరిత రాజకీయాలను తిప్పికొట్టాలి




**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, ఆగస్టు 19:** కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థలను దుర్వినియోగం చేస్తూ, ఓట్ల తొలగింపు పేరిట కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసేందుకు కుట్రపూరిత రాజకీయాలకు పాల్పడుతోందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన జిల్లా రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో స్థానిక రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై నాయకులు సుదీర్ఘంగా చర్చించారు.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర కాంగ్రెస్ ఇన్ చార్జి సచిన్ సావంత్ తో పాటు ఎంపీ రఘురామ్ రెడ్డి, జిల్లా డిసిసి అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.ఓటర్ల తొలగింపుపై సమరశంఖంఎస్ఐఆర్ ప్రక్రియను అడ్డం పెట్టుకుని రాష్ట్రంలో ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీతో కలిసి భాజపా కుట్రలు చేస్తోందని మంత్రి పొంగులేటి ఆరోపించారు. కాంగ్రెస్ కు అండగా నిలిచే దళిత, గిరిజన, మైనారిటీ వర్గాల ఓట్లే లక్ష్యంగా సుమారు 67 నుండి 68 లక్షల ఓట్లను తొలగించేందుకు శ్రీకారం చుట్టారని, మరొక 70 లక్షల ఓట్లను గాలిలో పెట్టి ఓటర్లను గందరగోళానికి గురిచేస్తున్నారని విమర్శించారు. ఈ కుట్రలను తిప్పికొట్టేందుకు రాబోయే 4-5 రోజుల్లో బూత్ స్థాయి కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు.సోషల్ మీడియా విషప్రచారాలపై నిఘాముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుంటే, ప్రతిపక్షాలు నెలకు రూ.4 నుండి 5 కోట్లు ఖర్చు చేస్తూ సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ శ్రేణులంతా ఈ విషప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ నుంచి కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను గెలుచుకుని, రాహుల్ గాంధీని దేశ ప్రధానిని చేయడమే ప్రతి ఒక్క కార్యకర్త లక్ష్యంగా పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు.

# రూపాదేవిని హత్య చేసింది ఆ విద్యాసంస్థ విద్యార్థులే..

**రూపారెడ్డి హత్య కేసును ఛేదించిన నల్గొండ జిల్లా పోలీసులు**
**రూ.1.54 లక్షల నగదు, కత్తి, ఐఫోన్, సెల్‌ఫోన్లు స్వాధీనం**
**జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్**




**ముద్ర, దేవరకొండ:** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని నాగార్జున పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ కె. రూపా రెడ్డి హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఆమె నిర్వహిస్తున్న పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులే రూపారెడ్డిని హత్య చేసినట్లు ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఎస్పీ కార్యాలయంలో మీడియాకు తెలిపారు. డబ్బుల కోసమే ఈ ఘాతుకానికి ఒడిగట్టారని అన్నారు. ఈ నెల 11న కొండ మల్లేపల్లి మండలంలోని వేర్వేరు తండాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు మాస్క్, హుడీ ధరించి రూపారెడ్డి ఇంటి వద్దకు వెళ్లారు. ఒక విద్యార్థి ఇంట్లోకి వెళ్లి డబ్బులు ఇవ్వాలని బెదిరించగా ఆమె ప్రతిఘటించారు. మాస్క్ ఊడిపోవడంతో విద్యార్థిని గుర్తించి కేకలు వేశారు. గుర్తింపు బయటపడటంతో వెంట తీసుకెళ్లిన కత్తితో ఆమెను పొడిచి హత్య చేశాడు. ఈ కేసును ఎస్పీ సవాలుగా తీసుకుని వెంటనే దేవరకొండ డిఎస్పీ అద్వర్యంలో 5 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. నేరస్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఆధునిక దర్యాప్తు పద్ధతులను ఉపయోగిస్తూ అన్ని కోణాల్లో విచారణ కొనసాగించాలని ప్రత్యేక బృందాలకు ఎస్పీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా ఫోరెన్సిక్ ఆధారాలు, ఫింగర్‌ప్రింట్స్, డాగ్ స్క్వాడ్, సీసీ కెమెరా ఫుటేజీ, సాంకేతిక ఆధారాలు, పాత నేరస్తుల వివరాలు, అనుమానితుల కదలికలు, రౌడీషీటర్ల వెరిఫికేషన్ తదితర అంశాలను ప్రత్యేక బృందాలు క్షుణ్ణంగా పరిశీలించారు. హత్య జరిగిన ప్రదేశంతో పాటు పరిసర ప్రాంతాల్లో సుమారు 30 కిలోమీటర్ల పరిధిని 360 డిగ్రీల కోణంలో పరిశీలిస్తూ సుమారు 70 సీసీ కెమెరాల ఫుటేజీలను ప్రతిరోజూ రాత్రి పగలు కష్టపడి విశ్లేషించారు. టెక్నికల్ అనాలసిస్, ఇన్ఫర్మేషన్ టీమ్స్‌తో కలిపి మొత్తం 5 ప్రత్యేక బృందాల్లో సుమారు 40 మంది పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం శ్రమించి 80 మందికి పైగా అనుమానితులను విచారించారు. హత్యకు ముందు రూపారెడ్డి తన చిన్నమ్మతో ఫోన్‌లో మాట్లాడుతున్న సమయంలో చివరిగా బాబు అని పలికారు. అనంతరం ఆమె ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో ఆమె చివరిగా బాబు అని ఎవరిని ఉద్దేశించి మాట్లాడారు అనే ప్రశ్న పోలీసుల దర్యాప్తులో కీలకంగా మారింది. ఈ కోణంలో విచారణ చేపట్టగా రూపారెడ్డి తన పాఠశాలలో విద్యార్థులను సాధారణంగా బాబు అని పిలిచేవారని పోలీసుల దృష్టికి వచ్చింది. దీంతో దర్యాప్తు పాఠశాల విద్యార్థుల వైపు మళ్లింది. ప్రిన్సిపల్ మరణానికి సంతాప సూచకంగా పాఠశాలకు వరుసగా ఆరు రోజులు సెలవులు ప్రకటించడంతో విద్యార్థులను విచారించడంలో కొంత ఆలస్యం జరిగింది. పాఠశాల పునఃప్రారంభమైన అనంతరం పోలీసులు విద్యార్థులను ఒక్కొక్కరిని సున్నితంగా విచారిస్తూ దర్యాప్తును కొనసాగించారు. ఈ క్రమంలో రెండు రోజులుగా పాఠశాలకు హాజరుకాని కొంతమంది విద్యార్థులపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. వారిలో అయిదుగురు విద్యార్థులు కొత్తగా జల్సాలకు అలవాటు ఐనా వారిపై ప్రత్యేక దృష్టి సాదించినారు. నేరస్థలంలో లభించిన సిసిటివి ఫూటేజ్ లు అనుమానిత విద్యార్థులతో సరిపోలడంతో వారిపై ప్రత్యేక దృష్టి సారించి నేరానికి పాల్పడినది సదరు విద్యార్థులే అని నిర్ధారించుకొని నమ్మదగిన సమాచారం మేరకు బుధవారం ఉదయం 11:30 గంటల సమయంలో పెండ్లిపాకల రోడ్డు నుండి మల్లేపల్లి వస్తున్న దొనియాల రోడ్ వద్ద బైక్‌పై వస్తున్న పదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులను అదుపులోకి తీసుకుని సున్నితంగా విచారించి తనిఖీ చేయగా లోదుస్తుల్లో నగదు దాచుకున్నట్లు గుర్తించారు. అందులో సుమారు రూ.1.54 లక్షల నగదు, అలాగే స్వాదీన పరుచుకున్న మూడు 500 నోట్లపై రక్తపు మరకలు ఉన్నట్లు గుర్తించడం జరిగింది. నగదు ఎక్కడి నుంచి వచ్చిందని విచారించగా, ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్యకు పాల్పడి నగదును అపహరించినట్టు వెల్లడించినారు. ఒక విద్యార్థి వయస్సు 16 సంవత్సరాలు, పదో తరగతి విద్యార్థి, నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ పుల్సింగ్ తండా, కొండమల్లేపల్లి మండలం, రెండో విద్యార్థి వయస్సు 16 సంవత్సరాలు, పదో తరగతి (నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్) పిల్యతండ, కొండమల్లేపల్లి మండలం. నిందితులు ఇద్దరూ నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ పాఠశాల నందు 10 తరగతి చదువుతు హాస్టల్ నందు ఒకే గదిలో ఉంటున్నారు. వీరు జల్సాలు, చెడు వ్యసనలకు అలవాటుపడి హాస్టల్ గదులలో వారి తల్లి తండ్రులకు తెలియకుండా సెల్ ఫోన్ లు వినియోగిస్తూ సోషల్ మీడియా, యూట్యూబ్ లలో డబ్బులు తేలికగా ఏలా సంపాదించాలి అని వెతుకెవారు. గతనెలలో వీరిద్దరు హాస్టల్ లో డబ్బులతో ప్రికిపాల్ కి దొరుకుతారు అట్టి విషయం లో ప్రిన్సిపల్ వారియొక్క తల్లి తండ్రుల సమక్షంలో మందలించగ ఇట్టి విషయాన్ని మనసులో పెట్టుకొని ప్రిన్సిపల్ పై కక్ష పెంచుకుంటారు. ప్రిన్సిపల్ రూపారెడ్డి వద్ద పెద్ద మొత్తంలో డబ్బు ఉంటుందని భావించి సోషల్ మీడియాలో ఆదారాలు దొరకుండా హత్యపై అన్వేషణ చేసి హత్యకు పాల్పడి నగదును అపహరించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. పథకంలో భాగంగా వీరిద్దరు వారం రోజుల నుండి ప్రిన్సిపల్ అంతమొందించాలని సాంకేతికంగా దొరకాకుండా రెక్కి నిర్వహించి వారి ప్రణాళికలో భాగంగా మంగళవారం సాయంత్రం సుమారు 4 గంటలకు పాఠశాల నుంచి ఇంటికి వెళ్లి, బ్యాగులో నుంచి ఎరుపు రంగు హుడీ టీషర్ట్, ప్యాంట్ తీసుకుని వచ్చాడు. అనంతరం కొండమల్లేపల్లిలో ఇద్దరు కలిసి కత్తి, గ్లౌజులు కొనుగోలు చేశారు.రూపారెడ్డి ఇంటి సమీపంలోని వాటర్ ట్యాంక్ వద్దకు చేరుకుని, ఎవరైనా వస్తున్నారా అని ఒకరు గమనిస్తుండగా మరొకరు ఇంటి వెనుక భాగం నుంచి లోపలికి ప్రవేశించాడు. అప్పటికే తెరిచి ఉన్న వంటగది ద్వారా ఇంట్లోకి ప్రవేశించి రూపారెడ్డిపై కత్తితో విచక్షణ రహితంగా దాడి చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అనంతరం బెడ్‌రూమ్‌లో ఉన్న 2.50 లక్షల నగదును తీసుకుని ఇంటి వెనుక గోడ దూకి నిర్మానుష్య ప్రాంతం నుంచి వెళ్లిపోయారు. కత్తి, గ్లౌజులు, మాస్క్, సెల్‌ఫోన్‌ను చెట్ల పొదల్లో పడేశారు. కొంత దూరంలో బట్టలు మార్చుకుని, ఎరుపు రంగు హుడీని డ్రైనేజీలో వేసి అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు విచారణలో వెల్లడైంది. నిందితుల నుంచి రూ.1.54 లక్షల నగదు, మృతురాలి ఐ ఫోన్, హత్యకు ఉపయోగించిన కత్తి, చేతి గ్లౌజులు, మాస్కులు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన దేవరకొండ డీఎస్పీ శ్రీనివాసరావు, మల్లెపల్లి సీఐ నవీన్ కుమార్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ జితేందర్ రెడ్డి, మల్లెపల్లి ఎస్ఐ రమేష్, చింతపల్లి ఎస్ఐ రామ్మూర్తి, గుడిపల్లి ఎస్ఐ నరసింహులు, గుర్రంపోడు ఎస్ఐ వెంకన్న, సురేష్, హెడ్ కానిస్టేబుళ్లు కరుణాకర్, విష్ణు వర్ధనగిరి, వహీద్ పాషా, నాగార్జున ప్రసాద్, పుష్పగిరి, ప్రసాద్ రావు, ఫయాజ్, ప్రభాకర్, కానిస్టేబుళ్లు హేము నాయక్, గులాం దస్తగిరి, సాయికుమార్, శివరాజ్, జునైద్ అహ్మద్, నరేష్, సాయి, కమల్ కిషోర్, వేణుగోపాల్ రెడ్డి, భాస్కర్, శరన్ రెడ్డి, నాగరాజు, అనిల్, హెచ్‌జీ శేఖర్‌లను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ అభినందించి రివార్డులు ప్రకటించారు.

## బీసీఐ చైర్మన్ రాజీనామా చేయాలి



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** బీసీఐ చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా వెంటనే రాజీనామా చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. మనన్ కుమార్ మిశ్రా 14 ఏళ్లకు పైగా బీసీఐ చైర్మన్‌గా కొనసాగుతూ, చట్టబద్ధమైన ప్రజాస్వామిక సంస్థలో అధికారాన్ని వ్యక్తిగతంగా కేంద్రీకరించడం అభ్యంతరకరమన్నారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఏ రాజకీయ పార్టీకి లేదా ప్రభుత్వానికి అనుబంధ సంస్థ కాదని, దేశంలోని న్యాయవాదులందరికీ ప్రాతినిధ్యం వహించాల్సిన స్వతంత్ర చట్టబద్ధ సంస్థ అని తెలిపారు. కొంతమంది విద్యార్థులు శాంతియుతంగా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసినందుకు మొత్తం బ్యాచ్‌ను శిక్షించడం రాజ్యాంగ విలువలకు, న్యాయవాదుల చట్టం–1961 నిబంధనలకు విరుద్ధమన్నారు. ఆయన వ్యవహారశైలికి నిరసనగా 21న రాష్ట్రవ్యాప్తంగా అన్ని కోర్టుల వద్ద న్యాయవాదులు నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఐలు జిల్లా గౌరవ అధ్యక్షులు కుక్కదువ్వ సోమయ్య, జిల్లా అధ్యక్షులు బొల్లెపల్లి కుమార్, ఉపాధ్యక్షులు తడక మోహన్, పాల్వంచ జగతయ్య, ఎం.డి. నేహాల్, సహాయ కార్యదర్శి సీసా శ్రీనివాస్, నాయకులు సూరగాని శ్రీహరి, చింతల రాజశేఖర్ రెడ్డి, బొడ్డు కిషన్, భాస్కర్ రెడ్డి, ఐలయ్య, మల్లేష్, హమీద్ పాల్గొన్నారు.

## ప్రభుత్వంపై ధ్వజమెత్తిన బీఆర్ఎస్ నాయకులు



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, ఆగస్టు 19 :** గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన పనులను తామే చేసినట్లుగా కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదమని బీఆర్ఎస్ నాయకులు పగడాల నాగరాజు, ఆర్.జె.సి. కృష్ణ, బి.రెడ్డి నాగచంద్రారెడ్డి విమర్శించారు. 2023లోనే మున్నేరు సీసీ వాల్, సస్పెన్షన్ బ్రిడ్జి, మెడికల్ కాలేజీ యూజీడీ పనులు బీఆర్ఎస్ హయాంలోనే మంజూరయ్యాయని, జీవోలే దానికి నిదర్శనమని స్పష్టం చేశారు ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.11.34 కోట్లతో కల్పించిన సౌకర్యాలను కూల్చివేసి, రూ.150 కోట్లతో మళ్లీ నిర్మాణాలు చేపట్టడం ప్రజాధనం వృథా చేయడమేనని మండిపడ్డారు. దీనిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్.ఆర్. రోడ్ విస్తరణ బాధితులకు వెంటనే నష్టపరిహారం లేదా ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించాలని, నిలిచిపోయిన షాదీఖానా నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో నాయకులు కూరాకుల నాగభూషణం, కమర్, బచ్చు విజయ్, బత్తుల మురళి పాల్గొన్నారు.

## ఆగస్టు 24న ఆటో, క్యాబ్ డ్రైవర్ల బంద్

**ఖమ్మంలో పోస్టర్ ఆవిష్కరణ**



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, ఆగస్టు 19 :** తెలంగాణ ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ 24న నిర్వహించనున్న ఆటో, క్యాబ్ డ్రైవర్ల రాష్ట్రవ్యాప్త బంద్ గోడ పోస్టర్లను, ఆటో స్టిక్కర్లను ఖమ్మం జిల్లా ఆటో యూనియన్ల జేఏసీ ఆవిష్కరించింది. బిఆర్టియు జిల్లా కార్యాలయంలో షేక్ సత్తార్మియా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో యూనియన్ నేతలు పగడాల నాగరాజు, పుప్పాల శ్రీకాంత్ తదితరులు మాట్లాడారు.ఉచిత బస్సు పథకం వల్ల ఆటో డ్రైవర్లు తీవ్రంగా ఉపాధి కోల్పోయారని, ఈఎంఐలు కట్టలేక ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పొరుగున్న ఆంధ్రప్రదేశ్‌లో జీవనభృతి ఇస్తున్నప్పుడు, తెలంగాణలో ఎందుకు అమలు చేయడంలేదని ప్రశ్నించారు. ఈ బంద్‌లో ఆటో, క్యాబ్ డ్రైవర్లందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు పాల్వంచ కృష్ణ, జిల్లా ఉపేందర్, పేరబోయిన మోహన్‌రావు, రవీందర్, శ్రీనివాస్, వై పాషా, ధరావత్ రాందాస్, రావుల శ్రీనివాస్, తోట నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారిగా కే.ధనంజనేయులు



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కే. ధనంజనేయులు ను పదోన్నతి తో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారిగా బదిలీ పై యాదాద్రి భువనగిరి జిల్లాలో నియమించడం జరిగింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారంగా ఆయన బుధవారం జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతిని కలిసి బాధ్యతలు స్వీకరించారు. అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కే.ధనంజనేయులు మాట్లాడుతూ క్రీడల అభివృద్ధి కి పాటు పడతానని తెలిపారు.

## ఫొటో జర్నలిస్టులతో కేక్ కట్ చేసిన విప్



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ప్రపంచ ఫోటోగ్రఫీ డే సందర్భంగా బుధవారం యాదగిరిగుట్టలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కేక్ కట్ చేసి ఫోటో జర్నలిస్టులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ కమిటీ జిల్లా అధ్యక్షుడు గంధమల్ల రాజు, ఉపాధ్యక్షులు కృపానగరంఫణిదర్, గుజ్జ నరేష్, ప్రధాన కార్యదర్శిదేశ్ పాండే నరసింహ, కోశాధికారి మోగిలిపాక కనక రాజు, సహాయ కార్యదర్శికర్రె గణేష్, ప్రచార కార్యదర్శి కృపానగరం అభిషేక్ తో పాటు ఫోటో గ్రాఫర్లు కందోజు రవి కిరణ్, పండరి నరేందర్ పాల్గొన్నారు.

## నిర్వాసితులకు న్యాయం చేయడమే లక్ష్యం

**ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** బస్వాపూర్ రిజర్వాయర్ నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆర్అండ్ఆర్, భూసేకరణ కోసం సీఎం రూ.206 కోట్ల నిధులు విడుదల చేసిన సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బి.ఎన్.తిమ్మాపురం గ్రామస్థుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి విడుదల చేశారని, నియోజకవర్గ ప్రజల తరఫున ముఖ్యమంత్రి కి కృతజ్ఞతలు తెలిపారు. బస్వాపూర్ ప్రాజెక్టు పూర్తయితే భువనగిరి, వలిగొండ, నకిరేకల్, రామన్నపేట, తుంగతుర్తి ప్రాం తాల రైతు లకు సాగునీరు అందుతుందని చెప్పారు. మూసీ మురుగు నీటిపై ఆధారపడకుండా గోదావరి జలాలతో సాగు చేసుకునేలా ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రిజర్వాయర్‌లో ఐదు టీఎంసీల నీటిని నింపి రైతులకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. నేషనల్ హైవే వద్ద కాల్వ పనులతో పాటు బునాదిగాని, ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి కాల్వల పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని వెల్లడించారు.ఎమ్మెల్యేకు గ్రామస్థుల కృతజ్ఞతలుబస్వాపూర్ రిజర్వాయర్ ముంపు గ్రామమైన బి.ఎన్.తిమ్మాపురం గ్రామస్థులు సర్పంచ్ ఎడ్ల వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని క్యాంపు కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేతో కలిసి ర్యాలీగా అంబేద్కర్ చౌరస్తాకు చేరుకుని డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణిరవి కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖా–బాబురావు, ఆత్మ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ పోతంశెట్టి మంజులవెంకటేశ్వర్లు, పీఏసీఎస్ చైర్మన్లు సతీష్ పవన్, శ్యామ్‌గౌడ్, కౌన్సిలర్లు, మండలాల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, బి.ఎన్.తిమ్మాపురం గ్రామస్థులు పాల్గొన్నారు.

## జిపి కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**ఎంపీడీవో ఆఫీస్ ఎదుట నిరాహార దీక్ష**



**ముద్ర, బీబీనగర్ :** గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, బీబీనగర్ మండల కేంద్రంలో లోని ఎంపీడీవో కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం నిరాహార దీక్ష నిర్వహించారు. రాష్ట్ర గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పైళ్ల గణపతి రెడ్డి, రాష్ట్ర మహిళా కన్వీనర్ పొట్ట యాదమ్మ, సిఐటియు మండల కన్వీనర్ బండారి శ్రావణ్ కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు నాంపల్లి భాస్కర్, జిల్లా సహాయ కార్యదర్శి సిల్వర్ రమేష్, జిల్లా కోశాధికారి గడ్డం ఈశ్వర్, మండల ఉపాధ్యక్షులు పాశం బాలయ్య, మహిళా కన్వీనర్ పొట్ట లక్ష్మీనరసమ్మ, నాయకులు శోభ పోచయ్య, యాదగిరి, లింగం, వెంకటేష్, ఉపేందర్ పాల్గొన్నారు.

## విలేకరిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**ముద్ర, తుంగతుర్తి:** మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన సాక్షి విలేకరి వర్దెల్లి వీరమల్లు బుధవారం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిశోర్ కుమార్ ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. అనంతరం రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేసి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమేష్, ఉప సర్పంచ్ నాగరాజు, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు గుండగాని రాములు, రజాక్, శ్రీరాంరెడ్డి, గోపగాని శ్రీను పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం 20.08.2026
www.mudranews.in | @mudranews



### మసాలా, కారం ఎక్కువగా ఉంటే



నెమ్మదిగా నీరు తాగండి
మిరపకారం, మసాలాలు ఎక్కువగా ఉన్న ఆహారం తిన్నప్పుడు దాహం వేయడం సహజం. అయితే వెంటనే పెద్ద మొత్తంలో నీరు తాగడం కంటే కొద్దికొద్దిగా తీసుకోవడం వల్ల కడుపుపై అసౌకర్యం తగ్గవచ్చు.

# పేదల సొంతింటి కలకు సర్కారు భరోసా

- హుజూర్‌నగర్‌లో ఉత్తమ్ కలల గృహ సముదాయం
- రాష్ట్రవ్యాప్తంగా గృహ నిర్మాణానికి మరింత వేగంగా
- ప్రభుత్వం విఫలమైన చోట పేదల ఆశలు నెరవేరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- రామస్వామిగుట్టలో 2,160 ఇళ్ల భారీ కాలనీ
- సెప్టెంబర్ తొలి వారంలో ప్రారంభోత్సవానికి సన్నాహాలు
- అర్హులకే ఇళ్లు.. ఎంపికలో రాజకీయ సిఫారసులకు తావులేదు
- ప్రతి ఇంటికీ విద్యుత్, నీరు, డ్రైనేజీ సహ మౌలిక వసతులు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**ముద్ర, హైదరాబాద్, ఆగస్టు 19:** రాష్ట్రంలో నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో వేలాది పేద కుటుంబాల గృహ ఆకాంక్షలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అర్హులను గుర్తించడం నుంచి ఇళ్ల మంజూరు, నిర్మాణం పూర్తి చేయడం వరకు కార్యాచరణతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.బుధవారం రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి గృహ నిర్మాణ కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. ప్రభుత్వం చేపట్టిన గృహ నిర్మాణ కార్యక్రమం క్షేత్రస్థాయిలో మరింత వేగంగా అమలు కావాలని, మంజూరైన ఇళ్ల నిర్మాణంలో జాప్యానికి తావులేకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. పేదలకు గౌరవప్రదమైన సొంతింటిని అందించడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన సంక్షేమ ప్రాధాన్యాల్లో ఒకటని స్పష్టం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న గృహ నిర్మాణ కార్యక్రమంలో భాగంగా హుజూర్‌నగర్‌లోని రామస్వామిగుట్ట వద్ద నిర్మిస్తున్న 2,160 ఇళ్ల భారీ గృహ సముదాయాన్ని మంత్రి ఉత్తమ్ తన కలల ప్రాజెక్టుగా ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. కేవలం నాలుగు గోడలు, పైకప్పుతో సరిపెట్టకుండా పేద కుటుంబాలు గౌరవంగా జీవించేందుకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలతో దీనిని ఆదర్శ గృహ సముదాయంగా తీర్చిదిద్దాలన్నది తన లక్ష్యమని ఆయన అధికారులకు స్పష్టం చేశారు.రామస్వామిగుట్ట కాలనీ పనుల పురోగతిని మంత్రి సమగ్రంగా సమీక్షించారు. సెప్టెంబర్ మొదటి వారంలో కాలనీ ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని, మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. లబ్ధిదారులు గృహప్రవేశం చేసే నాటికి ఏ ఇంటిలోనూ చిన్న లోపం కూడా ఉండకూడదని, నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడవద్దని స్పష్టం చేశారు.కాలనీలోని 2,160 ఇళ్లను ఒక్కొక్కటిగా తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటికీ తలుపులు, కిటికీలు, విద్యుత్ సౌకర్యం, బాత్‌రూమ్‌లకు నీటి సరఫరా, డ్రైనేజీతో పాటు అవసరమైన అన్ని మౌలిక వసతులు ఉన్నాయో లేదో నిర్ధారించాలని చెప్పారు. సాధ్యమైన చోట పెండింగ్ పనులన్నింటినీ ఏడు నుంచి పది రోజుల్లో పూర్తి చేయాలని గడువు విధించారు.లబ్ధిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకత పాటించాలని మంత్రి స్పష్టం చేశారు. "ఒక్క అనర్హుడికీ ఇల్లు దక్కకూడదు.. అదే సమయంలో నిజంగా అర్హత ఉన్న ఒక్క నిరుపేద కుటుంబం కూడా నష్టపోకూడదు. రాజకీయ సిఫారసులు అర్హతను అధిగమించలేవు" అని తేల్చిచెప్పారు. పెండింగ్ జాబితాలను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి, సొంతిల్లు లేని బీపీఎల్ కుటుంబాలకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మంజూరు కోసం ఎదురుచూస్తున్న వాస్తవమైన అర్హుల దరఖాస్తులను జాప్యం లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు.రామస్వామిగుట్టను కేవలం గృహాల సముదాయంగా కాకుండా సంపూర్ణ నివాస కాలనీగా అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. అంతర్గత రహదారులు, పచ్చదనం, పాఠశాల, కమ్యూనిటీ హాల్, సామూహిక మరుగుదొడ్లు, రీడింగ్ రూమ్‌లు తదితర సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల నిర్మాణ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని, మిగిలిన సామాజిక మౌలిక వసతుల పనులను వేగవంతం చేయాలని సూచించారు.కాలనీ పరిసరాల్లో ఇప్పటికే దాదాపు 10 వేల అదనపు మొక్కలు నాటినట్లు అధికారులు మంత్రికి వివరించారు. మిగిలిన మొక్కల పెంపకం, ల్యాండ్‌స్కేపింగ్ పనులను త్వరగా పూర్తి చేయడంతో పాటు నాటిన మొక్కల దీర్ఘకాలిక సంరక్షణకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు."పేదవాడికి ఇల్లు అంటే కేవలం ఒక నిర్మాణం కాదు.. అది ఒక కుటుంబానికి భద్రత, ఆత్మగౌరవం, భవిష్యత్తుపై భరోసా. రామస్వామిగుట్ట కాలనీ ఆ భావనకు ప్రతిరూపంగా నిలవాలి" అని మంత్రి పేర్కొన్నారు.

# కోతుల బెడద నియంత్రణపై చర్యలు



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ జిల్లాలో కోతుల బెడద నివారించడానికి స్థానిక శాసనసభ్యులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో వేగవంతమైన కార్యాచరణతో ముందుకు కదలాలని కలెక్టర్ ప్రతిమ సింగ్ మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు.కోతుల బెడద నివారణపై డీఎఫ్ఓ జోజి, డిపిఓ యాదయ్య, మెదక్, నర్సాపూర్, తూప్రాన్ మున్సిపల్ కమిషనర్స్ తో కలెక్టర్ ప్రతిమాసింగ్ సమీక్షించారు. మెదక్ జిల్లాలో కోతుల బెడద తీవ్ర రూపం దాల్చడంతో అనేక పర్యాయాలు రైతుల నుండి ప్రజల నుండి పంటలను ధ్వంసం చేస్తున్నాయని, ఇండ్లలో దూరి ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయని, చదువుకునే విద్యార్థిని విద్యార్థులు కూడా వీటి దాడిలో గాయపడ్డట్లు ప్రజావాణిలో అనేక విన్నపాలు రావడం జరిగిందన్నారు. , ప్రజలు, రైతులు కోతులతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని వాటి నుండి పూర్తిగా విముక్తి చేయాలనే సదుద్దేశంతో క్షేత్రస్థాయిలో రైతుల పంటలను కాపాడాలని, ప్రజా ప్రతినిధులు, కౌన్సిలర్లు, ప్రజల సహాయ సహకారాలు తీసుకోవాలను ఆదేశించారు. కోతులను పట్టడానికి వాటిని తరలించడానికి అవసరమయ్యే నిధులపై , ప్రజా ప్రతినిధులు స్వచ్ఛంద సంస్థలు, ప్రజల సహాయ సహకారాలు ఉంటాయన్నారు. కోతులను పట్టిన వెంటనే స్థానిక అటవీ అధికారుల ఎఫ్ఆర్ఓ సహకారంతో నిర్మల్ జిల్లాకు తరలించి కుటుంబ నియంత్రణ పద్ధతి ద్వారా వాటిని అక్కడే విడిచి పెట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

### ట్రిపుల్‌ఆర్ భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలి

కలెక్టరేట్లో రింగ్ రోడ్డుకు సంబంధించి ట్రిపుల్ ఆర్ భూసేకరణ ప్రక్రియపై నేషనల్ హైవేస్, రైల్వే, రెవిన్యూ ఆర్డీవోలు, తహసిల్దార్లతో సమీక్షించారు. ట్రిపుల్ ఆర్ నియోజకవర్గం వారీగా భూ సేకరణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అవార్డు పాసైన భూముల వివరాలను భూమి రాసి పోర్టల్ లో నమోదు చేయాలని, రైతులకు పేమెంట్ జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. భూసేకరణ ప్రక్రియను ఆలస్యం చేయకుండా పూర్తి చేయడం ద్వారా రింగ్ రోడ్ నిర్మాణ పనులు త్వరగా పూర్తవుతాయని తెలిపారు. రైల్వే డబ్లింగ్ వర్క్ మేడ్చల్ టు ముద్దేడ్ వివరాల గురించి చర్చించారు. ఇన్చార్జి అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్, ఆర్డీవోలు రమాదేవి, రామకృష్ణ, బావయ్య, నేషనల్ హైవేస్ మేనేజర్ రాహుల్, రైల్వే ఎస్ఈ డి.ధర్మారావు, రాకేష్తహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## ఏటీఎంలో రు. 14.40 లక్షలు చోరీ

నిందితులను పట్టుకుంటాం: ఎస్పీ




**ముద్ర ప్రతినిధి,, మెదక్:** మెదక్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మంబోజిపల్లిలో ఎస్‌బీఐ ఏటీఎంలో బుధవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్పీ డీవీ. శ్రీనివాస్ రావు, డీఎస్పీ ప్రసన్నకుమార్, రూరల్ సీఐ కృష్ణమూర్తి, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలాన్ని సందర్శించారు. ఏటీఎంలో 14.60 లక్షల రూపాయలు చోరీకి గురైనట్లు బ్యాంకు అధికారులు మెదక్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాల ఏర్పాటుఏటీఎం చోరీ ఘటనపై ఎస్పీ డీవీ. శ్రీనివాస్ రావు పోలీసు అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిందితులను త్వరగా పట్టుకోవాలని ఆదేశించారు. సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించి, సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు ముమ్మరం చేయాలని సూచించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించినట్లు తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. త్వరితగతిన కేసును ఛేదించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలి

దిశ సమావేశంలో ఎంపీ రఘురాం రెడ్డి




**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, ఆగస్టు 19 :** జిల్లాలో ప్రభుత్వ నిధులతో చేపడుతున్న అన్ని అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు పూర్తి స్థాయిలో ప్రయోజనం అందించాలని ఖమ్మం ఎంపీ, దిశా కమిటీ చైర్మన్ రామసహాయం రఘురాం రెడ్డి అధికారులను ఆదేశించారు. ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ దివాకర టి.ఎస్, సీపీ సునీల్ దత్‌లతో కలిసి ఆయన దిశా కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వివిధ శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. నేషనల్ హైవేలు, అమృత్ 2.0 పనులను వేగవంతం చేయాలని, అంగన్‌వాడీల్లో మౌలిక వసతులపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పాఠశాలలు, గురుకులాల్లో భోజన నాణ్యత, బోధనపై ముందస్తు సమాచారం లేకుండా ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని స్పష్టం చేశారు. సన్నబియ్యం బ్లాక్ మార్కెటింగ్‌కు గురికాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఖమ్మం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను డిసెంబర్ 2026 నాటికి పూర్తి చేయాలని సూచించారు.కలెక్టర్ దివాకర టి.ఎస్ మాట్లాడుతూ వరంగల్–ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు షెడ్యూల్ ప్రకారం జరుగుతున్నాయని తెలిపారు. విద్యుత్ కనెక్షన్లకు కొత్త విధానం అమలు చేస్తున్నామని, జిల్లాలో ఉపాధి హామీ, పింఛన్లు, రేషన్ సరుకుల పంపిణీ సజావుగా సాగుతోందని వెల్లడించారు. త్వరలో ప్రతి నియోజకవర్గానికి 1,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కానున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నాయకుడికి ఆర్థిక సాయం

**ముద్ర, తుంగతుర్తి:** బోనాల పండుగ రోజు తుంగతుర్తి మండల కేంద్రంలో జరిగిన గొడవలో గాయపడిన బీఆర్ఎస్ నాయకుడు పోలేపాక కృష్ణ ని తుంగతుర్తి మాజీ శాసన సభ్యులు డా. గాదరి కిశోర్ కుమార్ బుధవారం పరామర్శించారు.ఈ సందర్భంగా కృష్ణ ఇంటికి వెళ్లిన ఆయన ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందేలా సూచనలు చేశారు తక్షణ సహాయంగా రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు విరహత్ అలీకి మాతృ వియోగం

**ముద్ర, గజ్వేల్:** తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు కె. విరహత్ అలీ మాతృమూర్తి బాషారత్ ఉన్నిసా బేగం అనారోగ్యంతో బుధవారం తెల్లవారు జామున కన్నుమూశారు. ఆమె అంత్యక్రియలు బుధవారం సాయంత్రం 4 గంటలకు గజ్వేల్‌లో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.బాషారత్ ఉన్నిసా బేగం మృతికి మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతాపం తెలిపారు. విరహత్ అలీ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు.

### ఆమె మరణం బాధాకరం

**ముద్ర, దేవరకొండ:** తెలంగాణ రాష్ట్ర యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ రాష్ట్ర అధ్యక్షుడు ఖాజా విరాహత్ అలీ మాతృమూర్తి బషారత్ ఉన్నీసా బేగం మృతి చెందడం ఎంతో బాధాకరమని టీయూడబ్ల్యూజే ఐజేయు దేవరకొండ డివిజన్ ఉపాధ్యక్షుడు ఖాజా మొహినుద్దీన్ అన్నారు. అనంతరం ఆమె పార్థివదేహానికి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. దివంగత మాతృమూర్తి బషారత్ ఉన్నిసా బేగం ఆత్మకు శాంతి చేకూరాలని ఆమె కుటుంబాన్ని ఈ కష్టకాలంలో భగవంతుడు ధైర్యం నింపాలని అయన ప్రార్థించారు. బషారత్ ఉన్నిసా బేగం మరణం చెందడం అత్యంత విషాదకరం అన్నారు. వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామని ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు అయన పేర్కొన్నారు.

## కోతుల బెడద నివారణకు ప్రత్యేక చర్యలు



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** పట్టణ ప్రజల భద్రత దృష్ట్యా భువనగిరి పురపాలక సంఘం ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలో కోతులను పట్టే కార్యక్రమం బుధవారం చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ పర్యవేక్షణలో ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ, పట్టణంలోని కోతుల బెడద ఎక్కువగా ఉందని ప్రజల నుండి ఫిర్యాదులు రావడంతో ఈ ప్రత్యేక డ్రైవ్ చేపట్టడం జరిగిందన్నారు. కోతులను సురక్షితంగా పట్టి, అటవీ ప్రాంతంలోకి తరలించే చర్యలు చేపట్టారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని అదికారులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ కె. చంద్ర ప్రకాష్ రెడ్డి, శానిటరి ఇన్స్ పెక్టర్, మున్సిపల్ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పెండింగ్ డిఏలను విడుదల చేయాలి

బీఆర్ఎస్ పోరుబాట
ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు న్యాయం జరిగే వరకు బిఆర్ఎస్ పోరాటం




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** పెండింగ్‌లో ఉన్న అన్ని డి ఏ లను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం పోరుబాట భువనగిరి పట్టణ కేంద్రంలో అమరవీరుల స్థూపం దగ్గర జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణ రెడ్డి అధ్యక్షతన, భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైల్ల శేఖర్ రెడ్డి, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి ల నేతృత్వంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఏనుగుల రాకేష్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.ఉద్యోగులకు తక్షణమే పి ఆర్ సి అమలు చేసి సిపిఎస్ రద్దు చేసి ఓ పి ఎస్ ను అమలు చేయాలన్నారు.రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ గ్రాట్యుటీ, పెన్షన్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలన్నారు.కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పీఫ్ , ఈఎస్ఐ , ఆరోగ్య, సామాజిక భద్రత కల్పించాలన్నారు.ఈ నెల 29న ఉద్యోగుల కలెక్టరేట్ ధర్నాలకు ప్రభుత్వం స్పందించాలన్నారు.ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు న్యాయం జరిగే వరకు బిఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఫొటోజర్నలిస్టులకు శుభాకాంక్షలు



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ప్రపంచ ఫొటోగ్రఫీ డే సందర్భంగా భువనగిరి పట్టణంలోని బాబు జగ్జీవన్‌రామ్ చౌరస్తాలో బుధవారం ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేక్ కట్ చేసి పట్టణంలోని ప్రముఖ ఫొటోగ్రాఫర్లకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఫొటోగ్రాఫర్లను శాలువాలతో సత్కరించి అభినందించారు.కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఫొటోగ్రఫీ అనేది ఒక కళ మాత్రమే కాకుండా సమాజంలో జరుగుతున్న ప్రతి ముఖ్యమైన ఘటనను చరిత్రలో భద్రపరిచే గొప్ప సాధనమన్నారు. ఒక ఫొటో ఎన్నో మాటలను చెప్పగలదని, ప్రజా సమస్యలను, సామాజిక పరిస్థితులను ప్రజల దృష్టికి తీసుకురావడంలో ఫొటోగ్రాఫర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఎండ, వానలను లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తూ వార్తలను ప్రజలకు చేరవేయడంలో ఫొటోగ్రాఫర్ల సేవలు అభినందనీయమన్నారు.ప్రపంచ ఫొటోగ్రఫీ డే సందర్భంగా భువనగిరి పట్టణంలోని ఫొటోగ్రాఫర్లందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే కుంభం హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఫణిందర్ , ఎండీ జకీర్ హుస్సేన్,గంధమల్ల రాజు,దేశపాండు నర్సింహ, అభి పాల్గొన్నారు.

## మహిళలు వ్యాపారాల్లో రాణించాలి

**ముద్ర, సూర్యాపేట, ఆగస్టు 19:** ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంలో సూర్యాపేట మహిళలు ముందుండాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో 'మహిళా శక్తి' ఉత్సవాల్లో భాగంగా వీహబ్ నిర్వహించిన బూట్‌క్యాంప్‌లో ఆయన పాల్గొన్నారు.మహిళా సంఘాలకు జిల్లాలో రూ.700 కోట్ల రుణాలు అందించామని, వాటిని వ్యాపారాలు, ఉత్పత్తి యూనిట్ల ఏర్పాటుకు వినియోగించుకుని ఆదాయం పెంచుకోవాలని సూచించారు. ప్రతి గ్రామం నుంచి ఒక యూనిట్ ఏర్పాటయ్యేలా కృషి చేయాలన్నారు. ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్‌కు వీహబ్ సహకారం అందిస్తుందని తెలిపారు.కార్యక్రమంలో డీఆర్‌డీఓ పీడీ సన్యాసయ్య, వీహబ్ ప్రతినిధులు, అధికారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg. No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555